

పనులు పరిశీలిస్తున్న మంత్రులు కేశవ్, నారాయణ, రవీంద్ర, మనోహర్



సభా ప్రాంగణంలో అతిథులు కూర్చునేందుకు వేసిన సోఫాలు

మహోజ్వల ఘట్టం నేడే



రాజధాని పనుల పునఃప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

హాజరు కానున్న ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులు



మహోదయానికి ముహూర్తం నేడే..
నవ్యనగరి అమరావతి ప్రగతి పయనానికి
అడుగు పడేది నేడే...
ఐదేళ్ల చీకటి తెరను చీల్చుకుని.. కొత్త
వెలుగుల్లోకి కొంగొత్త ఆశలతో పైకెగసేది నేడే..

ఈనాడు – అమరావతి
న్యూస్‌టుడే–తుళ్లూరు

గత ప్రభుత్వ విధ్వంసకర పాలనతో చిట్టడవిలా మారిపోయిన రాజధాని అమరావతి పునరుజ్జీవం దిశగా అడుగులేస్తోంది. కూటమి ప్రభుత్వ సంకల్ప దీక్షతో పక్కా కార్యాచరణ ప్రణాళికతో కొత్త ఊపిరి పీల్చుకుంటోంది. రాజధాని పనుల పునఃప్రారంభోత్సవానికి శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. రాజధానిలో పనులు పరుగులు పెడితే ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలు ప్రగతి బాట పట్టనున్నాయి. మౌలిక వసతుల కల్పన పనుల్లో రెండు జిల్లాలవారు పెద్దఎత్తున భాగస్వాములు కాబోతున్నారు. అపారమైన ఉపాధి అవకాశాలతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి. పనుల పునఃప్రారంభోత్సవ వేళ రాజధాని ప్రాంతం సరికొత్త కాంతులతో వెలుగులీనుతోంది. భారీ యంత్రాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వృత్తినిపుణులు, కార్మికులతో సందడి మొదలైంది.



సిద్ధమవుతున్న పైలాన్

ఎదురుచూపులు ఫలించిన వేళ..

గత వైకాపా పాలనలో రాజధాని ప్రాంతంలో కన్నీరు పెట్టని వ్యక్తి లేరు. నిత్యం రైతుల ఆందోళనలు.. కర్షకుల కన్నీళ్లు.. కూలీల ఆకలి బాధలు.. వ్యాపారుల నిట్టూర్పులే కనిపించేవి. ఈ కష్టాలు ఎప్పుడు తీరతాయా అని కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. కూటమి ప్రభుత్వం రాకతో వారికి ఉపశమనం లభించింది. ఇప్పుడు రూ. వేల కోట్లతో పనులు చేపడుతుండడంతో భవిష్యత్తుపై భరోసా దక్కింది. ఆ ధీమాతోనే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజధాని గ్రామాల ప్రజలు పండగలా భావిస్తున్నారు.

అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ ఘట్టానికి సచివాలయం వెనుక సర్వం సిద్ధం చేశారు. జిల్లా యంత్రాంగంతోపాటు సీఆర్‌డీఏ, సాధారణ పరిపాలనశాఖ సమన్వయంతో గత పది రోజులుగా శ్రమించి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాయి. లక్షలాదిమందికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు.

ఉద్యోగ అవకాశాలొస్తాయి



అమరావతిని అభివృద్ధి చేస్తే దేశ, విదేశాలకు చెందిన అనేక కంపెనీలు పెట్టుబడులు పెడతాయి. కొత్త సంస్థలు వస్తాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలెన్నో దక్కుతాయి.

- టి. రవి, దళిత రైతు, దొండపాడు

పేదల జీవితాల్లో వెలుగు



రాజధాని ప్రాంతంలో అత్యధికులు బీసీ, ఎస్సీ ఎస్టీలే. రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం భూములు త్యాగం చేశారు. రాజధాని అభివృద్ధి చెందితే పేదలూ వృద్ధిలోకి వస్తారు.

- చిలకా బసవయ్య, అమరావతి దళిత బహుజన ఐకాస అధ్యక్షుడు, రాయపూడి



ప్రధాన వేదిక వద్దకు చేరే వారి కోసం కంపార్ట్‌మెంట్ల తరహాలో బారికేడ్లు



పర్యవేక్షిస్తున్న సీఎస్ విజయానంద్, చిత్రంలో వీరపాండ్యన్, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ముకేష్‌కుమార్ మీనా



పోలీసు అధికారులతో ఎస్పీజీ అధికారి

నిరంతర వెలుగుల్లో..

ఈనాడు, అమరావతి: అమరావతి నగర నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవం సందర్భంగా ప్రాంగణమంతటా విద్యుద్దీపాలు అమర్చారు. సాంకేతిక కారణాలతో సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచారు. ప్రధాన వేదిక సహా.. పరిసర ప్రాంగణాలు విద్యుత్తు వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. మొత్తం 1,595 కేవీఏ విద్యుత్తు లోడ్ ఉంటుందని అంచనా. ఈ మేరకు 3,185 కేవీఏ విద్యుత్తు లోడు సామర్థ్యంతో విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేశారు. 315 కేవీఏ సామర్థ్యం ఉన్న నియంత్రికలు 3; 160 కేవీఏ సామర్థ్యం ఉన్న నియంత్రికలు 14 ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై దీపాలతోపాటు శీతల యంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, ఎల్ఈడీ తెర, గ్యాలరీ, కూలర్లు అమర్చారు.



అమరావతికి 96 మెట్రిక్ టన్నుల అరటి రవాణా

అనంతపురం, న్యూస్‌టుడే : అమరావతి పనుల పునః ప్రారంభోత్సవానికి జనం భారీ సంఖ్యలో తరలిరానున్నారు. మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో అనంతపురం నుంచి 96 మెట్రిక్ టన్నుల అరటికాయలు కొనుగోలు చేసి అమరావతికి పంపారు. ముందుగా వ్యాపారులు అరటి కొనుగోలు చేశారు. రైపెనింగ్ చాంబర్లలో సహజ సిద్ధంగా అరటికాయలు మాగబెట్టారు. ప్యాకింగ్ చేసి 9 లారీల్లో పంపారు. గుంటూరు, మంగళగిరి, బాపట్ల, పల్నాడుల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో అరటికాయలు అన్‌లోడ్ చేశారు. అమరావతిలో భోజన ఏర్పాట్లన్నీ మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు.

మూడు పూటలా ఆహారం

ఈనాడు - అమరావతి : అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ సభకు వస్తున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు పండ్లు కూడా పంపిణీ చేయనుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి ఆహారం ఇవ్వనున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వస్తున్నవారికి బస్సుల్లోనే ఆహారం అందిస్తారు. ఒక్కో ఆహార కేంద్రం వద్ద ఒక్కో అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు.

గుంటూరు జిల్లావారికి...

జిల్లా నుంచి 1,835 బస్సుల్లో రానున్న 1,10,100 మందికి నాలుగు ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనం, డిన్నర్ అందిస్తారు. మంగళగిరిలోని డాన్‌బాస్కో స్కూల్, కాజా టోల్‌ప్లాజా, తాడికొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ స్థలం, రెయిన్‌ట్రీ పార్కు పక్కన ఖాళీ స్థలం.

ఉదయం అల్పాహారంలో...

- పులిహోర, రెండు అరటి పండ్లు, రెండు అరలీటరు నీటి సీసాలు, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్, మజ్జిగ ప్యాకెట్.

మధ్యాహ్న భోజనం..

- వెజిటబుల్ బిర్యానీ, రెండు అరటిపండ్లు, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్, మజ్జిగ, రెండు తాగునీటి సీసాలు.

వేదిక వద్ద..

- రెండు బిస్కెట్ ప్యాకెట్లు, రెండు నారింజ పండ్లు, ఓఆర్ఎస్ టెట్రాప్యాకెట్, మజ్జిగ, రెండు తాగునీటి సీసాలు.

రాత్రి డిన్నర్..

- కిచిడి, గోంగూర చట్నీ, రెండు తాగునీటి సీసాలు, మజ్జిగ.

శ్రామికుల అభిమానం.. మురిసిన డిప్యూటీ సీఎం

ఉపాధి కార్మికులతో పవన్ కల్యాణ్ ఆత్మీయ కలయిక

- మీరు హీరోగా చేసిన 'గుడుంబా శంకర్' సినిమా చూసేందుకు 46 కిలో మీటర్ల దూరం నడిచివెళ్లా. మీరంటే మాకు అంత ఇష్టం. **-పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఉపాధి శ్రామికుడు ఆరిక పాపారావు**

- 'హీరోయిన్ భూమికతో కలిసి మీరు నటించిన 'ఖుషి' సినిమా ఎన్నిసార్లు చూశానో. మీరంటే అభిమానం. మా అన్నకైతే ప్రాణం' **- పల్నాడు జిల్లాకు చెందిన శ్రామికురాలు చెంచు భూలక్ష్మి**

ఈనాడు-అమరావతి : మంగళగిరిలోని ఒక ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన 'ఉపాధి శ్రామికులతో ఆత్మీయ కలయిక' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన శ్రామికులతో ఆయన మాట్లాడించారు. పలువురు తమ అభిమానాన్ని చాటుకోగా పవన్ కల్యాణ్ మురిసిపోయారు. పల్నాడు జిల్లాకు చెందిన దివ్యాంగురాలైన శ్రామికురాలు భూలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి అవకాశం వస్తుందని జీవితంలో ఊహించి లేదని, తమ గ్రామానికి (అంచులరాజుపాలెం) రావాలని విజ్ఞప్తి చేశారు. కేపీపాలెంకి చెందిన నర్సింహమూర్తి మొగల్తూరును ప్రస్తావించినపుడు 'నేను పుట్టింది బాపట్లలో. మొగల్తూరుతో అనుబంధం తక్కువే. ఒకట్రెండుసార్లు వెళ్లినట్లు గుర్తు' అని పవన్‌కల్యాణ్ అన్నారు.

ఏఎన్‌యూ పరిధిలో పరీక్షలు వాయిదా

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈనెల 2న (శుక్రవారం) జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేడు రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో పరీక్షల వాయిదా నిర్ణయం తీసుకున్నామన్నారు. జాతీయ రహదారిపై వాహనాలను మళ్లించిన నేపథ్యంలో దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈ వెల్లడించారు. ఈనెల 2న జరగాల్సిన ఎంఏ ట్రాన్స్‌లేషన్, ఎంఏ ఆర్కియాలజీ, హిస్టరీ, ఎమ్మెస్సీ పరీక్షలను ఈనెల 3కి, ఎంఏ ఎకనామిక్స్ ఈనెల 6కి, ఎంఏ, ఎమ్మెస్సీ యోగా పరీక్షలను 5కి, ఎంఏ జర్నలిజం 3కి, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంహెచ్‌ఆర్ఎం 6కి, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ట్రావెల్, టూరిజం మేనేజ్‌మెంట్, ఎంకామ్ పరీక్షలు 7కి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష 13కి, ఎంఏ పబ్లిక్ పాలసీ 4కి, 2వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 9కి, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ 12కి, ఎంబీఏ అంతర్జాతీయ వ్యాపారం పరీక్ష 14కి, ఎంబీఏ పరీక్ష 17కి, ఎంఈడీ, ఎమ్మెస్సీ నానోటెక్నాలజీ ఫార్మా డీ, ఫైన్ ఆర్ట్స్ పరీక్షలు 6కి, న్యాయ విభాగం, యోగా డిప్లమో పరీక్షలు ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచారు.

93 శాతం మందికి పింఛన్ల పంపిణీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛను పథకంలో లబ్ధిదారుల్లో 93 శాతం మందికి నగదు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఉద్యోగులు గురువారం ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,51,912 మందికి రూ. 108.97 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారులు 2,33,461 మందికి రూ. 100.75 కోట్ల సొమ్ము అందజేశారు. మిగిలిన వారికి ఈనెల 2, 3వ తేదీల్లో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం గడువు నిర్ణయించింది.

4న పలు రైళ్ల రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున ఈనెల 4వ తేదీన పలు రైళ్లు రద్దు చేసినట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. దీనివల్ల గుంటూరు-రేపల్లె-గుంటూరు(67249/67250), గుంటూరు-రేపల్లె-తెనాలి(67223/67224), తెనాలి-రేపల్లె-తెనాలి(67231/67232), తెనాలి-రేపల్లె-గుంటూరు(67233/67234), విజయవాడ-తెనాలి(67221) రైళ్ల రాకపోకలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి రేపల్లె వచ్చే రైలు(17645) ఆదివారం 60 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుందని తెలిపారు.

గతిశక్తి పథకం పనులు త్వరగా ప్రారంభించాలి


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, డీఆర్ఎం సుధేష్ణ సేన్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గతిశక్తి పథకం కింద జరుగుతున్న ఆర్వోబీ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న పలు రైల్వే అభివృద్ధి పనులపై చర్చించారు. పెమ్మసాని మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు, పెదపలకలూరు ఆర్వోబీ పనులు, అసంపూర్తిగా నిలిచిపోయిన నందివెలుగు ఆర్వోబీ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అమృత్ భారత్ కింద గుంటూరులో రైల్వేస్టేషన్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, నాణ్యత, ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్ఎం సుధేష్ణ సేన్ మాట్లాడుతూ దేశంలో పలు ఆర్వోబీలపై రూఫ్ టాప్ ఏర్పాటు చేయడంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉంటారన్నారు. గుంటూరులో తాను ఇదే సమస్యను గుర్తించానన్నారు. పలు వంతెనలపై రూఫ్ టాప్ ఏర్పాటు చేయడం మంచిదన్నారు. రైల్వే క్రాసింగ్స్ వద్ద ద్విచక్ర వాహనాల ప్రమాదాలు, పశువుల రాకపోకలు నివారించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కావాలన్నారు. దీనికి పెమ్మసాని స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తామన్నారు.

ప్రధాని సభకు చేరుకోవాల్సిన మార్గాలు



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ✦ ఎంపీపీ, వీవీఐపీ, వీఐపీ వాహనాలు ప్రకాశం బ్యారేజ్ మీదుగా లోటస్‌పాయింట్, కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్ (ఈ3), ఎన్9 జంక్షన్ నుంచి సభా ప్రాంగణానికి చేరుకొని పీ8, పీ9 సెక్టార్లలో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు.

✦ **ఆకస్మిక మార్గం :** సభా ప్రాంగణం, ఈ3 రోడ్డు, కరకట్టరోడ్డు, ప్రకాశం బ్యారేజ్ ద్వారా విజయవాడ వెళ్లవచ్చు.

✦ వీఐపీ, ఏ ప్లస్ వాహనదారులు ప్రకాశం బ్యారేజ్ మీదుగా ప్యూ బ్రిడ్జి, ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గుహల రోడ్డు నుంచి కుడివైపు తిరిగి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న రోడ్డు (కరకట్ట పక్కన) ద్వారా సీడ్ యాక్సెస్ రోడ్డుకు (ఈ3) చేరుకొని ఎన్ 10 జంక్షన్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకోవాలి. వారి వాహనాలు సభా ప్రాంగణం వెనుక ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలి.

✦ **రూట్ 1 :** కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే వాహనాలు రూట్ నంబర్ 1 రహదారిలో గొల్లపూడి గ్రామం నుంచి పశ్చిమ బైపాస్ నవయుగ బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం గ్రామం వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లాలి. అక్కడ నుంచి మందడం ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎన్ 7 జంక్షన్ (మందడం పెట్రోల్ బంకు సమీపంలో) ద్వారా కుడివైపునకు తిరిగి పార్కింగ్ నంబర్ 6లో వాహనాలు నిలపాలి.

✦ **రూట్ 2:** కృష్ణా జిల్లా నుంచి రూట్ 2 ద్వారా వచ్చే వాహనదారులు వారధి, తాడేపల్లి హైవే, మయూరి టెక్ పార్కు డౌన్, ఎన్నారై అండర్‌పాస్, నేతన్న సర్కిల్, డాన్ బాస్కో స్కూల్, ఎర్రబాలెం, కృష్ణయ్యపాలెం, జడ్ జంక్షన్ ఈ8 రోడ్డు నుంచి పార్కింగ్ స్లాట్ నంబర్ 1 వద్దకు చేరుకోవాలి.

✦ **రూట్ 3 :** గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి రూట్ 3 ద్వారా వచ్చే వాహనదారులు కాజా టోల్ గేట్ సర్వీసు రోడ్డు నుంచి మురుగన్ హోటల్ ఎడమవైపు తిరిగి వెస్ట్ బైపాస్ మీదుగా ఎన్6, ఈ11 జంక్షన్, ఎన్9 జంక్షన్, ఈ8, ఎన్ 9 జంక్షన్ ద్వారా పార్కింగ్ స్లాట్ 1కి చేరుకోవచ్చు.

✦ **రూట్ 4 :** గుంటూరు నుంచి రూట్ నంబర్ 4 ద్వారా వచ్చే వాహనదారులు గుంటూరు, తాడికొండరోడ్డు, తాడికొండ, పెదపరిమి, ఈ6 రోడ్డు ప్రారంభం (తుళ్లూరు అయ్యప్పస్వామి ఆలయం), ఎన్11, ఈ7 జంక్షన్, ఎన్ 10 రోడ్డు నుంచి పార్కింగ్ స్లాట్ 1కి చేరుకోవాలి.

✦ **రూట్ 5 :** పల్నాడు జిల్లా నుంచి రూట్ నంబర్ 5 ద్వారా వచ్చే వాహనదారులు అమరావతి, పెద్ద మద్దూరు, వైకుంఠపురం, బోయపాలెం, దొండపాడు, రాయపూడి వై జంక్షన్, ఎమ్మెల్యే క్వార్టర్స్, న్యూపార్కు రోడ్డు, ఈ6, ఎన్ 11 జంక్షన్ నుంచి ఎన్ 11, ఈ7 జంక్షన్, ఎన్ 10 రోడ్డు ద్వారా పార్కింగ్ స్లాట్ 1కి చేరుకోవాలి.

✦ **అత్యవసర సేవల మార్గం :** అత్యవసర సేవలకు సంబంధించిన వాహనదారులు సభా ప్రాంగణం ఎన్9 జంక్షన్, కురుగల్లు, నిడమర్రు, మంగళగిరి నుంచి వెళ్లవచ్చు.

అమితంగా ప్రేమిస్తే అంతం చేసింది

వివాహేతర సంబంధమే కారణం


నిందితుల వివరాలు తెలియజేస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భార్యను ఎంతగానో ప్రేమించాడు.కానీ ఆమె వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను హత్య చేయించింది.. ఈ కేసును ఛేదించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ రమేష్ బాబు గురువారం విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. తెనాలికి చెందిన వెంకటమణి పృథ్వీరాజ్ (27)కు దూరపు బంధువైన వెంకటలక్ష్మితో 5 సంవత్సరాల కిందట ప్రేమ వివాహమైంది. ఆమె మొదటి భర్త అనారోగ్యంతో మృతి చెందగా ఇది రెండో వివాహం. దంపతులకు పిల్లలు లేరు. వీరు ఇద్దరు కొద్ది నెలల కిందట బెంగళూరు వెళ్లి అక్కడ భవన నిర్మాణ పనిలో చేరారు. అక్కడ పనిచేస్తున్న పల్నాడు జిల్లా బొల్లపల్లి మండలం వెల్లటూరుకు చెందిన 23 సంవత్సరాల కోటేశ్వరరావు పరిచయం అయ్యాడు. బెంగళూరులో పరిస్థితులు నచ్చక పృథ్వీరాజ్ తెనాలి వచ్చేయగా.. అక్కడే ఉన్న వెంకటలక్ష్మి, కోటేశ్వరరావు మధ్య వివాహేతర సంబంధం ఏర్పడి వారిరువురూ కలిసి నాలుగు నెలల కిందట వెల్లటూరు చేరారు. అక్కడ మూడు నెలల సహజీవనం తర్వాత కోటేశ్వరరావు మద్యం తాగి వచ్చి కొడుతూ ఉండడంతో మార్చిలో తెనాలి వచ్చిన వెంకటలక్ష్మి, తన పుట్టింటికి వెళ్లానని అబద్ధం చెప్పి తిరిగి భర్తతో కాపురం చేస్తోంది. అయితే కోటేశ్వరరావు, వెంకటలక్ష్మికి ఫోన్లు చేస్తూ ఉండేవాడు. భర్తకు అనుమానం రాకుండా అన్నయ్య అంటూ అతనితో మాట్లాడుతూ భర్తతోనూ మాట్లాడించేది. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్నాడని పృథ్వీరాజ్‌ను చంపాలని నిర్ణయించుకున్న కోటేశ్వరరావు, వెంకటలక్ష్మి పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నారు. గత నెల 27న కోటేశ్వరరావు, గుంటూరుకు చెందిన తమ బంధువు 19 సంవత్సరాల ఉదయ్‌కిరణ్, అతని స్నేహితుడు గుంటూరుకే చెందిన ఆటో నడిపే 15 సంవత్సరాల బాలుడు ముగ్గురు కలిసి బస్సులో తెనాలి వచ్చి పృథ్వీరాజ్‌కు ఫోన్ చేసి మల్లెపాడు శివారుకు పిలిపించి అందరూ మద్యం తాగిన తర్వాత అతన్ని కత్తితో పొడిచి రాయితో మోది హత్య చేశారు. అనంతరం హతుడి ఫోన్ తీసుకుని, అతని ఆటోలోనే పరారయ్యారు. కుమారుడి హత్య విషయంలో కోడలిపైనే అనుమానంగా ఉందని తండ్రి ఇచ్చిన సమాచారంతో కూపీ లాగిన పోలీసులు ఫోన్ల కాల్ డేటా, ఇతర ఆధునిక సాంకేతికత సహాయంతో సాక్ష్యాలతో సహా భార్యతో సహా నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పృథ్వీరాజ్ భార్యను అమితంగా ప్రేమించేవాడని, వివాహమైన కొత్తల్లో ఆమె పేరు (వెంకటలక్ష్మి) చేతిపై ఆంగ్లం అక్షరాలతో పచ్చబొట్టు పొడిపించుకున్నాడని, తర్వాత ఆమె ప్రవర్తన నచ్చక బాధపడేవాడని, తుదకు ఆమె వల్లే ఇలా ప్రాణాలు కోల్పోయాడని పోలీసులు వివరించారు.

ఉదయం 11 గంటలకల్లా బయల్దేరాలి

జిల్లాపరిషత్తు: రాజధాని పనుల పునఃప్రారంభోత్సవంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలోని ఎస్‌హెచ్‌జీ మహిళల కోసం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను కూడా సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 11.30 గంటల సమయంలో వాహనాల్లో బయలుదేరేలా చూడాలని అధికారులు సూచించారు. కలెక్టరు ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులకు బాధ్యతలు కేటాయించటంతో రెవెన్యూ, పౌర సరఫరాలు, డీఆర్‌డీఏ- వెలుగు విభాగాల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అమరావతి పనులు సజావుగా సాగాలని పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్, నాయకులు

పట్నంబజారు, పట్టాభిపురం: అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా పూర్తి కావాలని కోరుతూ తెదేపా పశ్చిమ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు తల్లం చాముండేశ్వరరావు(శేఖర్) గురువారం ఏటుకూరు రోడ్డులోని అమ్మవారి దేవస్థానంలో వెయ్యి కొబ్బరికాయలు కొట్టి అక్కడి నుంచి తుళ్లూరు మండలం వెంకటపాలెం వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను తూర్పు ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించి మాట్లాడారు. గోరంట్ల వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. చాముండేశ్వరరావు మాట్లాడుతూ పాదయాత్ర పట్టాభిపురంలోని రామాలయం, గోరంట్ల, అనంతవరంల్లో వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో పూజలు నిర్వహించి వెంకటపాలేనికి శుక్రవారం మధ్యాహ్నానికి చేరుకుంటుందన్నారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ల సత్యం, హేమ విజయకుమార్, ఫిరోజ్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షకుల అభ్యున్నతికి కూటమి కృషి

తాడేపల్లి, న్యూస్‌టుడే: కార్మిక, కర్షకుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదలైంది. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి సాధించిన రోజే మేడే అన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములన్నారు. వారికి అన్ని విధాలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులకు ఆయన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయకూడదు: ఎస్పీ


ఎస్పీ సతీష్‌కుమార్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మే 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి ప్రాంతం పర్యటన దృష్ట్యా వెలగపూడిలోని సచివాలయం పరిసర ప్రాంతాల్లో అనధికార డ్రోన్లు, నలుపు రంగు బెలూన్లు ఎగరవేయకూడదని ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ పర్యటన నేపథ్యంలో హెలికాప్టర్ రాకపోకలు జరగనున్నాయని కావున అనధికార డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయడం వల్ల ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్నందని తెలిపారు. ఎవరైనా ఆజ్ఞలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

7 నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు



మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలను ఈ నెల ఏడు నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ సహాయ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనం నిర్వహిస్తారు. 8వ తేదీ రాత్రి నరసింహ హోమం, శ్రీవారికి గరుడ సేవ, తొమ్మిదో తేదీ ఉదయం ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశాభిషేకం, ప్రసాద వితరణ, రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ, 10న లక్ష్మీనారాసింహ హోమం, లక్ష పుష్పార్చన, 11న నామకరణ హోమం, 12న శాంతికల్యాణం, రాజాధిరాజా వాహనంపై గ్రామోత్సవం ఉంటాయని పేర్కొన్నారు.

ఐదు మండలాల్లో స్వల్ప వర్షపాతం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఐదు మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 2.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది. మంగళగిరి 19.4, తాడేపల్లి 11.6, దుగ్గిరాల 4.6, తెనాలి 3, కొల్లిపర 2.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

బీఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో ఈనెల 28 నుంచి నిర్వహించే నాలుగో సెమిస్టర్, ప్రత్యేక బీఈడీ ఎడ్యుకేషన్ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. ఈనెల 31 వరకు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని సీఈ తెలిపారు.

ఉండవల్లి చినడొంకకు సీడ్ యాక్సెస్ రోడ్డు అనుసంధానం



తాడేపల్లి, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం వెంకటపాలెం వరకు వచ్చి ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డును ఉండవల్లి చినడొంక వరకు విస్తరించారు. కృష్ణా కరకట్ట దిగువున ఈ రోడ్డు నిర్మించారు. ప్రధాని సభ సందర్భంగా యుద్ధప్రాతిపదికన అధికారులు అనుమతులివ్వడంతో ఉండవల్లి కొండవీటి వాగు వంతెన వద్ద నుంచి వాహనాలు నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి వరుసలు పెడుతున్నాయి. ఫలితంగా కరకట్టపై వాహనాల రద్దీ తగ్గనుంది. ఉండవల్లి కూడలి నుంచి అనంత పద్మనాభస్వామి గుహల వరకు వచ్చి కొండవీటి వాగు వంతెన మీదుగా చినడొంక నుంచి వీఐపీలు నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి వెళ్లి రాజధానికి చేరుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు దీపాలను కూడా అమర్చారు. సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి ఉండవల్లివైపు వచ్చే వాహనాలు అటు ఉండవల్లి, ఇటు పెనుమాక మీదుగా మంగళగిరి చేరుకోవచ్చు. మంగళగిరి, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం మీదుగా రాజధానికి మరో మార్గం ఉంది.

హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన షేక్ బాజీవలి అనే వ్యక్తి పలకలూరు రోడ్డులోని విశ్వేశ్వర వైన్స్‌లో మరమ్మతు చేస్తుండేవాడు. 2018 మే 5న ఉదయం అక్కడికి మద్యం తాగడానికి అదే గ్రామానికి చెందిన మన్నవ సాగర్‌బాబు వచ్చారు. తన వాహనాన్ని మద్యం దుకాణం ముందు నిలిపారు. దీనిపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తర్వాత బాజీవలి తన కుమారుడితో కలిసి సాగర్‌బాబుతోపాటు అతని సన్నిహితుడు దేవరకొండ విజయ్‌పై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించాడు. గాయపడిన విజయ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదుచేయగా డీఎస్పీ బి.సీతారామయ్య కేసు దర్యాప్తు జరిపి ఛార్జిషీట్ దాఖలు చేశారు. బాజీవలిపై నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి శరత్‌బాబు తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మొబినాబేగం ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 125, లైవ్ ధర - 147, డ్రెస్డ్ విత్‌స్కిన్ - 213, స్కిన్‌లెస్ - 243. కృష్ణా జిల్లా: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 127, లైవ్ ధర 149, డ్రెస్డ్ విత్ స్కిన్ - 216, స్కిన్‌లెస్ - 246. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 130, 139, 150 డ్రెస్డ్ స్కిన్ - 248, స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

[illegible] ఫారం గుడ్డు ధర రూ. [illegible] (రవాణా & మార్జిన్ కలిపి) [illegible]

కృష్ణానదిలో మునిగి బాలుడి మృతి

కుటుంబ సభ్యుల కళ్లెదుటే ఘటన


మురారి (పాతచిత్రం)

తాడేపల్లి, న్యూస్‌టుడే: కృష్ణానదిలో మునిగి కుటుంబ సభ్యుల కళ్లెదుటే బాలుడు మృతిచెందిన ఘటన హృదయవిదారక సంఘటన ఇది. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన నరసింహారావు లాజిస్టిక్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లి మహానాడులోని ధ్యాన మందిరంలో జరిగిన కార్యశాలలో పాల్గొనేందుకు వచ్చారు. బుధవారం సాయంత్రం కార్యశాల ముగిసిన తర్వాత సమీపంలోని కృష్ణానదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అందరూ స్నానం చేస్తుండగా పెద్ద కుమారుడు మురారి (14) నీట మునిగి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకుని గజ ఈతగాళ్లను రంగంలోకి దింపారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కౌలు రైతు బలవన్మరణం


బసవయ్య (పాత చిత్రం)

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులపాలై పెదనందిపాడు మండలం పుసులూరులో కౌలు రైతు తుమటం బసవయ్య (44) బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకెళితే..బసవయ్య ఈ ఏడాది 25 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, జొన్న 15 ఎకరాలు, శనగ 10 ఎకరాలు సాగు చేశారు. తెగుళ్లు, ప్రతికూల వాతావరణం తదితర కారణాలతో దిగుబడి తగ్గి నష్టం వాటిల్లింది. గతంలో కూడా మిర్చి పైరు వేసి ఇదే రీతిన తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో సుమారు రూ.30 లక్షల మేర అప్పుల పాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన గురువారం ఉదయం కూడా తిరిగి రాలేదు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు పొలం వెళ్లి చూడగా అప్పటికే పురుగు మందు తాగి విగతజీవిగా పడిఉన్నారు. బసవయ్యకు భార్య శివపార్వతి, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

భర్త చూస్తుండగానే భార్య దుర్మరణం


రాజమణి (పాతచిత్రం)

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ దంపతుల బంధాన్ని రోడ్డు ప్రమాదం తెంచేసింది. అతివేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో భార్య ఘటనాస్థలిలోనే మృతి చెందగా..భర్తకు గాయాలయ్యాయి. సీఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల మేరకు పల్నాడు జిల్లా నరసరావుపేట షాలింనగర్‌కు చెందిన గాడిదపాటి రాజమణి(46) తాడికొండ మండలం మోతడక గ్రామంలో డిప్యూటేషన్‌పై ఆరోగ్య కార్యకర్త(ఏఎన్ఎమ్)గా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె కుటుంబీకులు గుంటూరులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 30వ తేదీ ఇంటి పని నిమిత్తం రాజమణి, ఆమె భర్త రవికుమార్ నరసరావుపేట వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలుదేరారు. రేపూడి శివారు వద్ద అతి వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న మిర్చి టిక్కీల లారీ వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కింద పడిపోగా.. రాజమణిపై నుంచి లారీ చక్రాలు ఎక్కాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త రవికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫిరంగిపురం పోలీసులు వివరాలు సేకరించారు. గురువారం నరసరావుపేట ప్రాంతీయ ఆసుపత్రిలో మృతదేహానికి శవపంచనామా జరిగింది. మృతురాలి భర్త రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తెనాలి డిపో నుంచి 376 బస్సులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ సభకు తెనాలి ఆర్టీసీ బస్ డిపో కేంద్రంగా మొత్తం 376 ఆర్టీసీ బస్సులు తరలి వెళ్తున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ గురువారం తెలిపారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాలకు కేటాయించిన ఈ బస్సులను గురువారం రాత్రి ఆయా కాలనీలు, గ్రామాలకు పంపుతామని, శుక్రవారం ఉదయం ప్రజలతో బయల్దేరతాయని వివరించారు. సభ అనంతరం తిరిగి ఆయా ప్రాంతాలకు చేరతాయన్నారు. ఆర్టీసీ బస్సులు కాకుండా ప్రయివేటు, ఇతర బస్సులు, వాహనాలతోనూ జన సమీకరణకు ఏర్పాట్లు జరిగాయి.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

3న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పర్యటన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం రానున్నారు. అత్యవసర విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీయూ, ఆర్టీసీ బ్లాక్ కాంపౌండ్ సమీపంలో నిర్మిస్తున్న వెంటిలేటర్లను ఆయన ప్రారంభించనున్నారు. కేంద్ర మంత్రితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు రానున్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 7,800
అత్యల్పం: 5,500
సగటు: 6,700

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి యడ్లలింగయ్య కాలనీలో మురుగు కాలువల పూడిక సరిగ్గా లేక దోమలు పెరిగిపోయాయి. రాత్రి సమయాల్లో నిద్ర ఉండటం లేదు. -రమేష్, నారాయణ, యడ్లలింగయ్య కాలనీ
✔ మురుగు పూడిక, దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. -బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్ -న్యూస్‌టుడే, తెనాలి టౌన్
? పొన్నూరు 23వ వార్డులో రహదారి ఎత్తు పల్లంగా మారడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది.-పి.డేవిడ్
✔ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. -జంగం అప్పర్, సహాయ ఇంజినీరు
? పొన్నూరు ఇస్లాంపేట శివారులో చెత్త పేరుకుపోయింది. -షేక్ జిలాని
✔ చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి - న్యూస్‌టుడే, పొన్నూరు

మేమున్నాం...మీకు తోడుగా శీర్షిక ఈనాడులో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించి పరిష్కరించారు. ❖ తెనాలి పట్టణ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ బజారులో వీధి దీపాలకు సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. ❖ పొన్నూరు వైద్యవినగర్‌లోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ❖ 10వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేయించారు. -న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు

స్పందనకు వందనం

పేరుకే డివిజన్ కార్యాలయం.. పర్యవేక్షణ నామమాత్రం

అదనపు బాధ్యతల వారితోనే సాగుతున్న విద్యా పాలన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

తెనాలి, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, కాకుమాను మొత్తం 8 మండలాలు, తెనాలి, పొన్నూరు పురపాలక సంఘాలు, తాడేపల్లి-మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయానిది. 170కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లోనే 40 వేల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యాలయ పరిధిలో ఉన్నారు. ఇంతటి కీలకమైన కార్యాలయంలో 2021 నుంచి ఇన్‌ఛార్జులతోనే కాలం గడుపుతున్నారు. ప్రస్తుత నాలుగో ఇన్‌ఛార్జి అధికారిణి శాంతకుమారి తాడేపల్లి-1 మండల విద్యాశాఖాధికారిణిగా ఉన్నారు. గత ఏడాది నుంచి ఈమె ఇక్కడ సాగుతున్నారు. ఈ క్రమంలో అక్కడి బాధ్యతలు చూసుకుంటూ తెనాలికి వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే కేటాయించగలుగుతున్నారు.

చదువులపై ప్రభావం..

ప్రతి పాఠశాలలో ఏడాది కొమార్లు పది మంది నిపుణులైన ప్యానెల్ ఉపాధ్యాయుల బృందంతో సమగ్ర పరిశీలన జరగాలి. విద్యార్థులకు బోధన సరిగ్గా సాగుతుందా? వారికి అర్థమవుతుందా? పరీక్షల్లో ఫలితాల తదితర అంశాలపై క్షేత్ర పరిశీలన జరగాలి. ఈ కార్యక్రమం అటకెక్కింది.

✦ఆకస్మిక తనిఖీలు పూర్తిగా పోయాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల రాకపోకలు, సిలబస్ మేరకు చదువులు, మధ్యాహ్న భోజనం, తాగు నీరు, పరిశుభ్రత తదితర అంశాల పరిశీలన లేదు. ఇక ప్రైవేటు పాఠశాలలను పట్టించుకునే పరిస్థితి ఏమాత్రం లేదు.

✦మొన్నటి పదో తరగతి పరీక్షల సమయంలో తెనాలిలోని ఒక పాఠశాలలో విద్యార్థికి ఒక ప్రశ్నపత్రం బదులు, మరొక ప్రశ్నపత్రం ఇచ్చారు. ఆ సమయంలో డివిజన్ అధికారి అందుబాటులో లేక మండల విద్యాశాఖాధికారిని పంపారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలోని ఒక పాఠశాలలో తనిఖీ చేసిన సమయంలో ఏదు గురు ఉపాధ్యాయులు సెలవు పెట్టిన అంశం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా పర్యవేక్షణ తీరును ఆయన ప్రశ్నించారు. పలు పాఠశాలల్లో సమయ పాలన లేక పోవడం, పిల్లలకు పాఠాలు సరిగ్గా చెప్పక పోవడం వంటి అంశాలు చర్చనీయాంశాలు అయ్యాయి.

✦డివిజన్ కార్యాలయం తీరు సరిగ్గా లేక పోవడంతో మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ప్రాబల్యం పెరిగింది. ఈ క్రమంలో అనేక ఆరోపణలు వినిపించాయి. ఈ కార్యాలయంపై కూడా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

✦డివిజన్ కార్యాలయంలో అటెండర్ పోస్టు గత మూడు సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ లేక పోవడంతో వివిధ సమాచారాలు ఉన్నతాధికారులకు పంపాల్సిన క్రమంలో పాఠశాలల నుంచి సిబ్బందిని పిలిపించి తాత్కాలికంగా పని చేయించుకోవాల్సి వస్తుంది.

✦ప్రస్తుత వేసవి సెలవుల్లో పదో తరగతి ఫలితాల విశ్లేషణ, రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చేరికలు పెంచడం, పుస్తకాల పంపిణీ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. పూర్తి స్థాయి అధికారి లేకుంటే అవన్నీ సక్రమంగా సాగే అవకాశాలు లేవు. త్వరలో విద్యాశాఖలో బదిలీల ప్రక్రియ జరగనున్నందున తెనాలికి పూర్తి స్థాయి అధికారిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.




తెనాలి డివిజన్ విద్యా కార్యాలయం

విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు



పొన్నూరు, న్యూస్‌టుడే: చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 26 సంవత్సరాలుగా విజ్ఞాన్స్ సంస్థలో వివిధ హోదాల్లో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ నిబంధనలు అనుసరించి విధుల నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ కార్యకలాపాలను సమన్వయం చేసుకుని సమర్థంగా పని చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉపకులపతి పి.నాగభూషణ్ ఆయన్ను అభినందించారు.

ఎఫ్‌వోగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్‌గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, వివిధ సమ్మేళ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా కార్యదర్శి శ్రీనివాసరావు, ఇతర నాయకులు యేసయ్య, వెంకటేష్, నాగేశ్వరరావు, నాగరాజు, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కేంద్రం కులగణన నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు అనేక సంవత్సరాలుగా ఈ విషయంపై పోరాడుతున్నారని సంఘ తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పహరేగూడెంలో ప్రధాని మోదీ, కేసన శంకరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, కుర్రా శ్రీను, జయకృష్ణ, సుబ్రమణ్యం, రామయ్య, వంశీ, మురళి, రమేష్, పోతురాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

3న ఎస్‌ఆర్‌ఎంలో ఉపకరణాల పంపిణీ

తుళ్లూరు: సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మే 3న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గ్రామీణ మహిళలకు 72 లక్షల విలువైన వివిధ వృత్తులకు సంబంధించిన ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. యూనివర్సిటీకి చెందిన ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 1500 మంది మహిళలకు స్వయం ఉపాధికి వివిధ పనుల్లో శిక్షణ అందించారు.

నూతన రహదారి నిర్మాణం

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు మండలం వెల్లలూరు ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఈ ఏడాది ఫిబ్రవరి 18న 'ఇలా ఉంటే.. వెళ్లేదెలా..?' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమవ్వగా మండల అధికారులు స్పందించారు. నూతన రహదారి నిర్మాణ పనులకు రూ.4 లక్షలు నిధులు మంజూరు చేశారు. రహదారి నిర్మాణ పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి నూతన రహదారి నిర్మించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు స్పందన



నాడు



నేడు

వైభవంగా మహా కుంభాభిషేకం



ప్రతిష్ఠించిన నవగ్రహాలు

వడ్లమూడి (చేబ్రోలు), న్యూస్‌టుడే: వడ్లమూడిలోని గంగాపార్వతి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారికి గురువారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మించి 100 వసంతాలు పూర్తైన సందర్భంగా ట్రస్టీలు, దాతలు, గ్రామస్థుల సహకారంతో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆదిత్యాది నవగ్రహ, కాలభైరవ, చండీశ్వర, జంట నాగేంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శాంతి కల్యాణం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం అంగలకుదురు దాసు కుటి పీఠంలో గురువారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీఠాధిపతి సీతారామ దాసు స్వామి పర్యవేక్షించారు.



శాంతి కల్యాణంలో..

ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం

వడ్లమూడి (చేబ్రోలు), న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ మాజీ మంత్రి, దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో వడ్లమూడి బాల కోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ పాడిపోషణ, ఎడ్లను పోషిస్తున్న రైతులను ఉత్సాహపరిచేందుకు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముందుగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ లాగుడు బండకు పూజ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాషువా ప్రతి ఏటా ఇటువంటి బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో 150కు పైగా ఎడ్ల జతలు పాల్గొంటున్నాయన్నారు. మొదటి రోజు టచ్ పళ్ల విభాగంలో 18 జతలు పోటీపడ్డాయి. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హాజరై రైతులకు జ్ఞాపిక, మొక్కలను పంపిణీ చేశారు. మొదటి రోజు పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జతలకు బహుమతిగా రూ.1.2 లక్షలను అందించిన నారాకోడూరుకు చెందిన జాలాది వెంకట్రామయ్యను, పోటీలకు సహకరించి పలు గ్రామాల తెదేపా నాయకులను ఎమ్మెల్యేలు సత్కరించారు. అభిమానులు ప్రదర్శనను తిలకించేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రైతుకు జ్ఞాపిక, మొక్క అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



బండ లాగుతున్న ఎడ్లు

అల్లుకున్న నిర్లక్ష్యం



నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు రావడంతో గృహోపకరణాలు సైతం దెబ్బతింటున్నాయి. సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

స్తంభం ఎప్పుడైనా కూలొచ్చు



గరువుపాలెం-శేకూరు రోడ్డులో పలు విద్యుత్తు స్తంభాలు పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. స్తంభాలకు వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన స్టాండ్‌లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైరు పటిష్టంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఇన్సులేటర్ ఓ స్తంభాన్ని వీడి గాలిలో వేలాడుతోంది. ప్రమాదం జరక్కముందే వాటిని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, చేబ్రోలు

ప్రమాదకరం.. భక్తుల భవనం



పెదకాకాని బాజీబాబా దర్గాలో భక్తులు విశ్రాంతి తీసుకునే భవనం ప్రమాదకరంగా మారింది. ఈ భవనం స్లాబుకి పలు చోట్ల పెచ్చులూడి ఇనుప రాడ్లు బయట పడ్డాయి. పైకప్పునకు పగుళ్లు వచ్చాయి. ఇందులోనే భక్తులు విశ్రాంతి తీసుకుంటున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా వక్ఫ్‌బోర్డు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెదకాకాని

మురుగు.. జనం బేజారు



పొన్నూరు మండలం మాచవరం గ్రామ ప్రధాన రహదారిలోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజులు తరబడి అక్కడే నిల్వ ఉండటంతో దుర్వాసనతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. -న్యూస్‌టుడే, పొన్నూరు



తెనాలి: కార్మిక చట్టాల గురించి వివరిస్తున్న న్యాయమూర్తి వివేక్‌వర్ధన్



తెనాలి: కేకు కోస్తున్న తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మురళి, నాగభూషణం తదితరులు



తెనాలి: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలి: మాట్లాడుతున్న బాబూప్రసాద్ తదితరులు

ఘనంగా మేడే

తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో గురువారం కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా కార్మిక చట్టాల గురించి న్యాయమూర్తులు వివరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని జెండాలు ఎగుర వేశారు.
- న్యూస్‌టుడే బృందం



కొల్లిపరలో..



పెదకాకానిలో..



పొన్నూరు: మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు



పొన్నూరు: ఎర్ర జెండా ఆవిష్కరణలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి రాజారావు తదితరులు

ప్రధాని సభను జయప్రదం చేద్దాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రధాన నరేంద్ర మోదీ పాల్గొనే రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల సభను జయప్రదం చేద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సభకు జన సమీకరణ ఏర్పాట్లపై చర్చించడానికి ఆయన గురువారం తెనాలి వచ్చారు. స్థానిక గౌతమ్ గ్రాండ్‌లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఇతర నాయకులు, రవాణా వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో రాజధానిని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ఈ సభకు తెనాలి నుంచి 30 వేల మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారని, రాజధాని ప్రగతిఫలాల్లో తెనాలి కూడా ఒకటిగా ఉంటుందని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బీ.టీ.నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నాయకుడు చల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీ టీ నాయుడు, కూటమి నాయకులు

కాలువ గట్లు బలహీనం.. రైతులకు కష్టం

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని పరిధిలోని గుంటూరు ఛానల్, హైలెవల్ కెనాల్ కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. నంబూరు, పెదకాకాని, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లోంచి గుంటూరు ఛానల్ ప్రవహిస్తోంది. కుచించుకుపోయిన గట్లపై పొలం పనులకు వెళ్లే రైతులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పొలాలకు ఎరువు కట్టలు తరలించే ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. నంబూరు వద్ద గుంటూరు ఛానల్‌కి ఇరువైపులా గట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నీటికి గట్టుకి నాలుగు అడుగుల తేడా మాత్రమే ఉంది. ఈ గట్ల పైనుంచి నిత్యం ఏఎన్‌యూకి వందల సంఖ్యలో గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. గతేడాది ఆగస్టులో వచ్చిన వరదల తాకిడి గట్టు బలహీనంగా ఉండి తెగిపోవడంతో వరద నీరు గ్రామాన్ని ముంచెత్తింది. పెదకాకాని శివారులో లాకుల వద్ద గట్లు కుంచించుకుపోయాయి. వైకాపా ఐదేళ్ల పాలనలో కాలువలోని తూటికాడ తొలగింపు, మరమ్మతులకు నిధులు కేటాయించగా తూటికాడ మాత్రమే తొలగించి బిల్లులు దండుకున్నారు. నంబూరు, గోళ్లమూడి, ఉప్పలపాడు గ్రామాల మీదుగా ప్రవహించే హైలెవల్ కెనాల్‌కి ఇదే పరిస్థితి. దీనిపై గుంటూరు ఛానల్ జేఈఈ అవినాష్‌ని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రస్తుతం కాలువలోని తూటికాడ తొలగించేందుకు మాత్రమే రూ.కోటి మంజూరు చేశారు. త్వరలో జగబోయే ఆధునికీకరణ పనుల్లో గట్టు పటిష్ఠ పరిచే అవకాశం ఉందని ఆయన చెప్పారు.



పెదకాకాని శివారులో గుంటూరు ఛానల్ కాలువ గట్టు ఇలా..

విద్యార్థికి తీవ్రగాయాలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కారు ఢీకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థికి గాయాలయ్యాయి. ఈనెల 2 నుంచి వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థి మహేష్ తన సొంతూరుకు బయలుదేరారు. ఏలూరు వెళ్లేందుకు ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్దకు చేరుకునే సమయంలో వేగంగా వచ్చిన ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కారు విద్యార్థిని ఢీకొట్టింది. రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు డ్రైవర్ దురుసుగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. తీవ్రంగా గాయపడ్డ గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన కోటేశ్వరరావు (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామీణ పోలీసులు గురువారం తెలిపారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో... : స్థానిక రామలింగేశ్వరపేటలోని పాత డిపో కూడలిలోని అద్దె ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ సాయికుమార్ (26) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసకావడం, ఆర్థిక ఇబ్బందులు కారణమని అతని సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు.

రాయితో దాడి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తూ పట్టణ మారీసుపేట రెండు గేట్ల మధ్య గురువారం యువకులు ఘర్షణ పడ్డారు. గోపి అనే యువకుడిపై శివ, శ్రీను రాయితో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

ల్యాప్‌టాప్ సంచి మర్చిపోయిన ప్రయాణికుడు

గుర్తించి అందించిన రైల్వే పోలీసులు

తెనాలి టౌన్: ప్రయాణికుడు రైల్లో మర్చిపోయిన ల్యాప్‌టాప్ సంచిని తిరిగి అతనికి అందించారు తెనాలి రైల్వే పోలీసులు. ఎస్సై వెంకటాద్రి గురువారం తెలిపిన సమాచారం మేరకు.. తెనాలి పట్టణ చెంచుపేటకు చెందిన షేక్ యాకూబ్ బాషా ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో బుధవారం కుటుంబంతో హైదరాబాద్ నుంచి గుంటూరుకు రైల్లో వచ్చి అక్కడ రాత్రి 9.30 గంటలకు గుంటూరు-రేపల్లె ప్యాసింజర్ ఎక్కారు. రైలు తెనాలిలో రాత్రి 10.30 గంటలకు నిలిచిన సమయంలో తమ వద్ద ఉన్న మూడు బ్యాగుల్లో రెండింటిని తీసుకుని ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును మర్చిపోయి దిగారు. ఇంటికి వెళ్లిన తర్వాత గుర్తించి వెంటనే తెనాలి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్వరం స్పందించిన రైల్వే పోలీసులు రేపల్లె స్టేషన్లోని తమ సిబ్బందికి విషయాన్ని తెలపడంతో అప్పటికే రేపల్లె చేరుకున్న రైలును వారు పరిశీలించారు. ల్యాప్ టాప్ ఉండడంతో దానిని తెనాలి చేర్చారు. ఎస్సై దానిని యాకూబ్‌బాషాకు అందించగా ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు పశ్చిమ

నగరాభివృద్ధిలో తెదేపా ముద్ర కనిపించాలి

మేయర్ కోవెలమూడితో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగరాభివృద్ధిలో తెదేపా ముద్ర స్పష్టంగా కనిపించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో పెమ్మసానిని మేయర్ కోవెలమూడి రవీంద్ర గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించుకున్నారు. 'నగరాభివృద్ధిలో రాబోయే 10 నెలలు ఎంతో ముఖ్యం. పెండింగ్ పనులన్నీ కార్యరూపం దాల్చాలి. పారిశుద్ధ్యం మెరుగుపడాలి. ముఖ్యంగా నార్ల ఆడిటోరియం, నల్లపాడు చెరువు, పీవీకే నాయుడు మార్కెట్, కృష్ణనగర్ రైతుబజార్ నిర్మాణం, రైల్వే వంతెనల నిర్మాణాల్లో కార్పొరేషన్ పనులు పూర్తయ్యేలా చూడాలి. గోరంట్ల మంచి నీటి రిజర్వాయర్ నిర్మాణం, మానస సరోవరం అభివృద్ధి, రోడ్ల అభివృద్ధిలో నాణ్యత, ప్రమాణాలు పాటించడం. నగరాభివృద్ధిపై దృష్టి సారించి మేయర్ పదవికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలి'.. అని పెమ్మసాని పేర్కొన్నారు. రవీంద్ర మాట్లాడుతూ నగరాభివృద్ధిపై తెదేపా మార్కు ఉండేలా చూస్తానన్నారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తానన్నారు.



రవీంద్రను సత్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్



కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 16, వంగ 20, బెండ 26, పచ్చిమిర్చి 29, కాకర 40, బీర 39, క్యాబేజి 16, క్యారెట్ 26, దొండ 18, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 20, గోరుచిక్కుళ్లు 31, దోస 18, సొర 14, పొట్లకాయ 19, అరటికాయ 7, చామదుంప 42, బీట్‌రూట్ 28, కీరదోసకాయ 29, బీన్స్ 64, క్యాప్సికమ్ 49, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 60, అల్లం 50, వెల్లుల్లి 110, చిలకడదుంప 38.

-న్యూస్‌టుడే, పట్టాభిపురం

అంతా మా ఇష్టం.. అందరికీ కష్టం!

రహదారులపై ఇష్టారాజ్యంగా కార్ల పార్కింగ్

పట్టాభిపురం, న్యూస్‌టుడే

సెల్‌ఫోన్ రింగవడమే తరువాయి.. రోడ్డుపైనే కారు నిలిపేసి మాట్లాడేవారు కొందరు. షాపింగ్‌కు వచ్చి అడ్డరోడ్డులో పార్కింగ్ చేసి వద్దామన్న స్పృహ లేకుండా రోడ్డుపైనే పార్కింగ్ చేసి వెళ్లేవారు ఇంకొందరు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా వైకాపా హయాంలో రహదారులను విస్తరించి అభివృద్ధి చేయలేదు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్లలో కార్లను ఎక్కడంటే అక్కడ ఇష్టారాజ్యంగా పెట్టేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ రహదారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. కొరిటెపాడు, విద్యానగర్, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, పట్టాభిపురం, బ్రాడీపేట, అరండల్‌పేటలోనూ ఇదే తీరు. రోడ్డుపై కార్లు పార్కింగ్ చేస్తే తోటి వారు ఇబ్బందులు పడతారన్న స్పృహ లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు విమర్శిస్తున్నారు.



గార్డెన్స్ ప్రధాన రహదారిలో రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



రోడ్డు పైనే కారు నిలిపివేసి వెళ్లడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

కారుకు సంకెళ్ల విధానం ఏమైందో..

రోడ్డుపై అడ్డదిడ్డంగా కార్లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ట్రాఫిక్ పోలీసులు గతేడాది అక్టోబరులో నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారులపై నిలిపివేసే కార్లకు తాళాలు వేసేవారు. అంచుల్లో కాకుండా రోడ్డుపై నిలిపితే.. ఫొటోలు తీసి నోటీసులు అంటించి టైర్లకు తాళాలు వేసి పోలీసులను సంప్రదించాలని తెలియజేసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చలానా చెల్లిస్తే తాళాలు తీసేవారు. అప్పట్లో కొన్నాళ్లు ఈ విధానం సత్ఫలితాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు జాడ గుంటూరు పశ్చిమలో కనిపించకపోవడంతో కార్ల యజమానులు, డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో ఎక్కడంటే అక్కడే నిలుపుతుండడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. దారికి అడ్డుగా నిలిపేస్తే ఎలాగని ప్రశ్నించిన వారిపై గొడవకు దిగుతున్నారు. ఏమాత్రం స్పృహ లేకుండా యూటర్న్ వద్ద కూడా నిలిపేస్తుండడంతో వెనుక వచ్చే వాహనచోదకులకు చిర్రెత్తుకొస్తుంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా స్పందించి రహదారులపై అడ్డంగా కార్లను నిలిపే వారిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

3న పెమ్మసాని పర్యటన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం రానున్నారు. అత్యవసర విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీయూ, రోటరీ క్లబ్ అందిస్తున్న వెంటిలేటర్లను ఆయన ప్రారంభించనున్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు 9వ రోజు కొనసాగాయి. గురువారం దీక్షలో పాల్గొన్న వారికి ఆర్‌సీఎం ఫాదర్ పి.చిన్నయ్య, ఫాదర్ చింతపల్లి అబ్రహం సంఘీభావం తెలిపారు.

జిల్లా కోర్టులో చలివేంద్రం ప్రారంభం

గుంటూరులీగల్: భారతీయత, స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో గురువారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఆ సంస్థ స్థాపకుడు, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో గత 25 ఏళ్ల నుంచి జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగలశెట్టి శివసూర్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

? ఏటీ అగ్రహారం 14వ లైన్‌లో రహదారిపై ఎండిపోయిన కొమ్మలు రహదారిగా అడ్డంగా ఉన్నాయి. దీంతో దోమలు వ్యాపిస్తున్నాయి. **-స్థానికులు, ఏటీ అగ్రహారం**

✔ సిబ్బందిని పంపి రహదారిపై కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- అంగడి రాజేష్, శానిటేషన్ సూపర్‌వైజర్**

చెత్త సమస్య పరిష్కారం: కంకరగుంట వంతెన కింద మందుల షాపు దగ్గర చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పబ్లిక్ ఆరోగ్య కార్యదర్శి సంజయ్‌నాయక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగించడంతో పాటు గ్రీన్ మ్యాట్ కట్టారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

దిల్లీకి అనూష బదిలీ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజినీరు(కోఆర్డినేషన్)గా పని చేస్తున్న జవ్వాది వెంకట అనూషను న్యూఢిల్లీలోని ప్రధాన కేంద్రంగా ఉన్న ఉత్తర రైల్వేకి బదిలీ చేస్తూ రైల్వే బోర్డు సంచాలకులు రవీంద్రపాండే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్‌లో ఆమె అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఇటీవలే అతి విశిష్ట రైల్వే సేవా పురస్కారం అందుకున్నారు.

రాజధాని అమరావతి పూర్వవైభవానికి కృషి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అయిదేళ్ల జగన్ కుట్రల్ని తట్టుకుని నిలిచిన అమరావతికి మళ్లీ పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి క్యాంపు కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం జరిగింది. అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ 'సీఎం చంద్రబాబు ఒక మహానగరాన్ని నిర్మించబోతున్నారు. అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి ఇంటికి ఇద్దరు వంతున రావాలి'.. అని కోరారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం నుంచి 30 వేల మందికి పైగా తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ గత అయిదేళ్లలో ప్రజలు ఎన్నో అవమానాలకు గురయ్యారన్నారు. అలుపెరగకుండా పోరాడిన రాజధాని రైతుల ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తెదేపా నాయకులు సింహాద్రి కనకాచారి, ముత్తినేని రాజేష్, కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి, వేదికపై గల్లా మాధవి, బీద రవిచంద్ర యాదవ్

అభివృద్ధి దిశగా ఏపీ పరుగులు

అరండల్‌పేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్‌నారాయణ తెలిపారు. చంద్రమౌళినగర్‌లోని భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోదీ రాజధాని పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కశ్మీర్‌లో ఉగ్ర దాడుల్లో మృతులను సానుభూతి తెలపలేని జగన్‌మోహన్‌రెడ్డి.. సింహాచలం ఘటనను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. మోదీపై షర్మిల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి, నాయకులు పాటిబండ్ల రవికుమార్, చరకా కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, వెంగలశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం సోమేపల్లి సేవలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘాలను ఏర్పాటు చేసి పలువురు కవులు, రచయితలను గుర్తించి వెలుగులోకి తెచ్చిన సోమేపల్లి వెంకటసుబ్బయ్య కృషి ఆదర్శనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలోని కొరటాల సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదాన సభ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ సభకు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుగడ్డలోనే అధికారిగా పేదలకు నివాస గృహాలు అందించడంతో.. వారు కాలనీకి వెంకటసుబ్బయ్య కాలనీగా పెట్టుకున్నారని గుర్తు చేశారు. డాక్టర్ బొమ్మినేనిపల్లి వెంకటేశ్వర్లు, గుళ్లపల్లి సుబ్బారావు, కందిమళ్ల శివప్రసాద్, నానా.. సోమేపల్లి కవి హృదయాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా రచయిత్రి సి.యమున, రాఘవరావు దంపతులకు పురస్కారమిచ్చి న్యాయనిర్ణేతలను సత్కరించారు. ఎస్.ఎం.సుభాని, శ్రీవశిష్ఠ సోమేపల్లి, తాతికొల పద్మావతి, దారివేముల అనిల్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.



యమున, రాఘవరావులను సత్కరిస్తున్న శివశంకర్ తదితరులు

కులగణన నిర్ణయం హర్షణీయం

ఏటీ అగ్రహారం: జనగణనతో పాటే సమగ్ర కులగణన చేపట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. కేంద్రం నిర్ణయం భవిష్యత్తులో ఓబీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఓబీసీల కుల గణనకు ఉద్యమించిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. సమగ్ర కులగణన జరిపించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.


ఐక్యతతో మెలగాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: కుటుంబాలు ప్రేమ, ఐక్యతతో మెలగాలని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ మాథ్యూస్ అన్నారు. నల్లపాడు రోడ్డులో మిర్చియార్డు పక్కనే ఉన్న స్థలంలో కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కుటుంబ ఆశీర్వాదపు ప్రత్యేక ప్రార్థనలు గురువారం జరిగాయి. బ్రదర్ హోసన్న, డేవిడ్ రాజు, తిమోతి, మోషే కృపా ఆనంద కీర్తనలు పాడారు.

కార్మికుల శ్రమతోనే సంపద సృష్టి



బ్యాంకు ఉద్యోగుల సంఘాల నాయకుల నినాదాలు



వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారిని సన్మానిస్తున్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు

కలెక్టరేట్, పట్టాభిపురం, న్యూస్‌టుడే: కార్మికుల శ్రమతోనే సంపద సృష్టి జరుగుతుందని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. పశ్చిమ క్యాంపు కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్మికులు ఇచ్చిన ఖాకీ చొక్కాను ఎమ్మెల్యే మాధవి ధరించి.. వారికి మిఠాయిలు తినిపించారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ జెండా ఆవిష్కరించి త్రినేత్ర ఆటో యూనియన్ స్టాండ్‌ను ప్రారంభించారు. తెదేపా జిల్లా కార్యాలయంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు, మదమంచి శ్రీనివాసరావు, పుల్లా సుందరం బాబు జెండా ఆవిష్కరించారు. ★ హిందూ కళాశాల కూడలిలోని యూనియన్ బ్యాంకు కార్యాలయం వద్ద మేడే సందర్భంగా గురువారం జెండాను ఎగురవేశారు. ★ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ప్రపంచ కార్మికుల దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారిని శాలువాలతో సత్కరించారు.

పిల్లల్ని క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సూచించారు. ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొత్తం 427 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. బాలబాలికలకు అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, షటిల్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, యోగా నామమాత్రపు రుసుంతో శిక్షణ ఇస్తున్నారన్నారు. ఎన్టీఆర్ స్టేడియాన్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ స్టేడియం నిరాదరణకు గురైందన్నారు. త్వరలో వ్యాయామశాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, మాజీ కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఉత్తమ కావ్యం రామచరిత మానస్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి చిమట రాఘవరావు తులసీదాసు రచించిన శ్రీరామచరిత మానస్ గ్రంథంపై ప్రసంగించారు. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాఘవరావు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో రామచరిత మానస్‌కు ఉన్నంత ప్రశస్తి, ప్రాచుర్యం మరే గ్రంథానికీ లేదనడంలో అతిశయోక్తి లేదన్నారు.

29న పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ

బ్రాడీపేట, న్యూస్‌టుడే: పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ మల్లెల రాజు తెలిపారు. లాడ్జికూడలిలోని నార్త్ ప్యారిస్ చర్చి ఆవరణంలో క్రైస్తవ, దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మల్లెల రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభను లాడ్జి కూడలిలోని లూథరన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్(ఎల్ఈఎం) క్రీడా మైదానంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నల్లపాడు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మిర్చియార్డులో పని చేస్తున్న దిబ్బయ్య (44) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా లయోలా విద్యా సంస్థ వద్దకు వచ్చేసరికి వేగంగా ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో దిబ్బయ్యకు గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించే లోగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కారులో నగదు చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కారులో నగదు అపహరణకు గురైంది. విద్యానగర్‌కు చెందిన సునీత కారును అరండల్‌పేట పోస్టాఫీసు వద్ద పార్కింగ్ చేసి లోపలకు వెళ్లారు. ఆమె తిరిగి వచ్చేసరికి కారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.40 వేలు దొంగలు అపహరించుకుపోయారు. దీంతో ఆమె అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిలాఫలకం ధ్వంసం.. 12 మందిపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గోరంట్ల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఇరు వర్గాల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఓ వర్గం వారు శిలాఫలకం ధ్వంసం చేశారని జనరల్ మేనేజర్ ఆదివిష్ణువర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడా సాంబశివరావుతో పాటు 12 మంది దేవాలయం వద్దకు వచ్చి గొడవ పెట్టుకుని శిలాఫలకం ధ్వంసం చేసి చంపుతామని బెదిరించారని ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తేదారుపై చర్యలు తీసుకోవాల్సిందే

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు మరణించారని, బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం కాంట్రాక్టరు నుంచే ఇప్పించాలని జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. భవిష్యత్తులో కాంట్రాక్టర్లు నాణ్యత, ప్రమాణాలు పాటించేందుకు ఈ చర్య దోహదపడుతుందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరావతి శిల్ప సంపద రప్పించాలని వినతి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశ విదేశాల్లో ఉన్న మన అమరావతి శిల్ప సంపదను తిరిగి అమరావతికి రప్పించేందుకు కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అఖిల భారత పంచాయతీ పరిషత్తు(న్యూదిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా దేశ విదేశాల్లో ఉన్న అమరావతి శిల్ప సంపదను తీసుకురావాలని కోరుతూ వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు.

గుంటూరు తూర్పు

కార్మికుల అభ్యున్నతికి కూటమి ఎనలేని కృషి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: కార్మికుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. మే డే దినోత్సవ వేడుకల్లో భాగంగా జెండాను ఆవిష్కరించారు. నసీర్ మాట్లాడుతూ శ్రమకు గౌరవం ఇవ్వడం మన ప్రగతికి పునాది వేయడమేనన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించిన చంద్రబాబు అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేసి రూ.5లకే ఆకలి తీరుస్తున్నారన్నారు. కార్మికులు ఆటోనగర్‌లో అన్న క్యాంటిన్ ఏర్పాటు చేయాలని కోరారు. 13వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పంపిణీలో భాగంగా పింఛన్లు పంపిణీ చేశారు.

పేదలకు అన్నదానం

పట్నంబజారు, న్యూస్‌టుడే: జిన్నాటవర్ సెంటర్‌లోని ఛాంబర్ కార్యాలయం వద్ద గురువారం మిర్చి వ్యాపారి గరిగంటి వెంకటేశ్వర్లు గురువారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీను, వెంకయ్య, మహేష్ పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు తువాళ్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

మానవత సంస్థ సేవలు అభినందనీయం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో మానవత స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మే డే సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు టవల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ఆధ్వర్యంలో ప్రతి మూడో గురువారం కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవత స్వచ్ఛందసంస్థ ఛైర్మన్ పి.రమేష్, అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి సతీష్, పన్ను చెల్లింపుదారుల సంఘం అధ్యక్షుడు నారాయణ, బీఎస్పీ నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో బీఆర్ స్టేడియం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: క్రీడలు వ్యాయామానికే కాదు.. జీవితంలో ఎదుగుదలకు మార్గదర్శకంగా నిలుస్తాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చివరకు వేసవి శిక్షణ శిబిరాలకు కూడా పే అండ్ ప్లే విధానాన్ని అమలు చేశారు. కూటమి ప్రభుత్వంలో 20 క్రీడాంశాలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. క్రీడల వల్ల విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు క్రీడా నైపుణ్యం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన 3 శాతం రిజర్వేషన్ ద్వారా క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. బీఆర్ స్టేడియాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. డీఎస్‌డీఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత జాడేది..?

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ ఎదుటే కూరగాయల మార్కెట్, పట్నంబజారు ప్రధాన రోడ్డులోనే నిత్యం చెత్తకుప్పలు పెద్ద ఎత్తున పేరుకుపోయి వీధులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదార్లే ఇలా ఉంటే ఇక అంతర్గత వీధులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. చెత్త కేంద్రాలు (బ్లాక్ స్పాట్‌లు) లేకుండా చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ దానికి అనుగుణంగా ముందస్తు కార్యాచరణ అమలు చేయకుండానే చాలా చోట్ల చెత్త పాయింట్లను పూర్తిగా తొలగించి ఆయా ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రం చేయించి చెత్త, వ్యర్థాలు కుప్పలు వేసే చోట్ల ఆకుపచ్చని పట్టాలు కట్టించి, నిబంధనలు ఉల్లంఘించి ఇక్కడ చెత్త వేస్తు అపరాధ రుసుం రూ.500 నుంచి రూ. 5 వేల వరకు విధిస్తామని హెచ్చరిక బ్యానర్లు పెట్టించారు. ఇలా ఆకుపచ్చని పట్టాలు, బ్యానర్లు పెట్టించారే కానీ పక్కాగా పర్యవేక్షణ ఉండటంలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయం పర్యావరణం కార్యదర్శుల పర్యవేక్షణలోపం, చిత్తశుద్ధిలేక పోవడంతో చెత్తకేంద్రాల వద్ద వ్యర్థాల పోగులు పడుతూనే ఉన్నాయి. ఒక క్రమబద్ధ వ్యవస్థ లేకపోవడంతోనే చెత్త, పారిశుద్ధ్య సమస్యలు పెరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.



చెత్త పాయింట్ వద్ద బ్యానర్


పట్నంబజారు రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

చిత్తశుద్ధిగా అమలుతోనే ఫలితాలు..

చెత్త కుప్పలు పోగుపడకుండా ఇంటింటి చెత్త సేకరించిన వెంటనే గార్బేజీ ట్రాన్స్‌ఫర్ సెంటర్(జీటీఎస్)లకు తరలించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఒక జీటీఎస్‌ను కూడా సిద్ధం చేసిన పరిస్థితి లేదు. కానీ చెత్త కేంద్రాలను మాత్రం తొలగిస్తూ నిర్ణయం తీసుకుని ఆకుపచ్చని పరదాలు కట్టించారు. ఈ చర్యలేమీ పారిశుద్ధ్యం మెరుగుకు ఉపయోగపడటం లేదు. చెత్త కేంద్రాల వద్ద వ్యర్థాలు వేసే వారిని గుర్తించి నిర్దేశించిన అపరాధరుసుం పక్కాగా అమలు చేయాల్సి ఉంది. దీనితో పాటు ఇంటింటి చెత్త సేకరణ పూర్తవగానే ఆయా పుష్‌కార్ట్‌లలో డబ్బాల నుంచే ట్రాక్టర్లలోకి వ్యర్థాలు వేసి తరలించాల్సిన అవసరం ఉంది. కానీ సేకరించిన చెత్తను తిరిగి చెత్త డబ్బాలను పాయింట్ల వద్దకు తీసుకుని వస్తుండటంతో సమస్య అలాగే ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

జిల్లా కోర్టులో చలివేంద్రం ప్రారంభం

గుంటూరులీగల్, న్యూస్‌టుడే: భారతీయత, స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో గురువారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఆ సంస్థ స్థాపకుడు, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో గత 25 ఏళ్ల నుంచి జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగలశెట్టి శివ సూర్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రవీంద్రబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతోపాటు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ నాయకుల నిరసన

పట్నంబజారు: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై భాజపా నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ స్థానిక రాజీవ్‌గాంధీభవన్ గురువారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు తక్షణం స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తన్వీర్, మీరావలి, సాయికృష్ణ, సలాం పాల్గొన్నారు.


నిరసనలో కరీం, మీరావలి, తన్వీర్ తదితరులు

వాడవాడలా అరుణ పతాకం రెపరెపలు

నెహ్రూనగర్, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పలు చోట్ల గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రమ లేకుండా ఏ సమాజం అభివృద్ధి చెందదని.. శ్రామికులను గౌరవించటం సామాజిక బాధ్యత అని వక్తలు కొనియాడారు. పార్టీ కార్యాలయాలు, ఆటో స్టాండ్‌లు, వాడవాడలా స్తంభాల వద్ద అరుణ పతాకాన్ని నాయకులు, కార్మికులు ఆవిష్కరించారు.


యూటీఎఫ్ కార్యాలయం వద్ద: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు, చిత్రంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కళాధర్ తదితరులు


డీఈవో కార్యాలయం వద్ద తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సత్కారం అందుకున్న వివిధ రంగాల వ్యక్తులు


నెహ్రూనగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్


కొత్తపేట : లెనిన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అజయ్‌కుమార్, మాల్యాద్రి, మరియదాసు, గని


నవభారత్‌నగర్‌లో జెండా ఆవిష్కరించి ఐద్వా కార్యదర్శి అరుణకుమారి, రాధ, సుబ్బరాయుడు, వాసు


పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యాదర్శి నళినీకాంత్, ఖాసిం షహీద్, నికల్సన్, వలి



అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన నాయకులు వీవీకే సురేష్, జానీ, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్


విద్యుత్తు భవన్ వద్ద జెండా ఆవిష్కరించిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సంఘం నాయకులు


సంగడిగుంట : సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ నాయకులు


జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బంది కేటాయింపు

నగరపాలకసంస్థ: అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జిల్లాకు వస్తున్నందున సభ జరిగే ప్రాంతం వద్ద పారిశుద్ధ్య పనుల కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. పార్కింగ్, ప్రధాన వేదికల వద్ద పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయనున్నారని తెలిపారు. వీవీఐపీలు, సాంస్కృతిక వేదిక వద్ద ప్రధానమంత్రి సభ ముగిసే వరకు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పార్కింగ్, ఇతర ప్రాంతాల్లో ఆరు వందల మొబైల్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సీతానగర్‌లో సమస్యల తిష్ఠ


సీతానగర్ 1వ వీధి మొదటి అడ్డరోడ్డులో వ్యర్థాలు


సీతానగర్ నుంచి పరమయ్యకుంటకు వెళ్లే రహదారిలో..


సీతానగర్ 3వ వీధి కాలువలో పేరుకుపోయిన మురుగు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

సీతానగర్‌వాసులు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సీతానగర్ నుంచి పరమయ్యకుంటకు వెళ్లేమార్గంలో కొద్ది రోజుల కిందట రహదారి నిర్మాణం చేశారు. ఆ సమయంలో పగలగొట్టిన రాళ్లముక్కలను రోడ్డుకు అడ్డంగా గుట్టగా పోసి తొలగించకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీళ్ల ట్యాంకర్ అడ్డుగా పెట్టేసి వదిలేశారు. సీతానగర్ 1వ వీధి మొదటి అడ్డరోడ్డులో ఇళ్లముందు చుట్టుపక్కల వాళ్లు వ్యర్థాలు తెచ్చివేయడం, కొట్టేసిన చెట్టుకొమ్మలు పడేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. మెడికల్ అసోసియేషన్ హాలు ఎదురు వీధిలో ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. 3వ వీధి వద్ద కాలువలు రోజు తీయకపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసనతో దోమలకు ఆవాసంగా మారింది. 4వ వీధిలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ నిర్మాణం చేసిన గోడ పడిపోవడం అక్కడ విద్యుత్తు ఫీజు డబ్బా మూతలు తెరిచి ఉండడంతో ప్రమాదకరంగా మారింది.

దోమల బెడదతో అల్లాడిపోతున్నాం : లక్ష్మి

ఇళ్ల ముందు వ్యర్థాలు పేరుకుపోవడం, కాలువల్లోని మురుగు రోజు తీయకపోవడంతో దోమల బెడదతో అల్లాడిపోతున్నాం. రహదారులపై గుంతలకు మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.

రాళ్ల కుప్పలతో ఇబ్బందిగా ఉంది

రోడ్డుపై అడ్డంగా రాళ్ల కుప్పలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. రాత్రివేళల్లో ముసలివాళ్లు, చిన్నపిల్లలు రాళ్లు తగిలి పడుతున్నారు. వీధి కుక్కల బెడద సమస్యగా మారింది. – వెంకాయమ్మ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరించి వారికి న్యాయం చేయాలని అగ్రిగోల్డు ఖాతాదారులు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర సమితి నాయకుల సమావేశం నిర్వహించారు. సమస్య పరిష్కారంలో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, అజయ్‌కుమార్, మాల్యాద్రి, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పక్కన నాయకులు

కులగణన నిర్ణయంపై హర్షం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని రజక జన సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎంటీబీ కూడలిలో జ్యోతిరావ్ పులె విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేకమైన మంత్రిని ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. సంఘాల నాయకులు నరసింహారావు, సుబ్బారావు, మణికుమారి, బాబురావు, రవిబాబు పాల్గొన్నారు.


జ్యోతిరావ్ ఫులె విగ్రహానికి పూలమాల వేస్తున్న జూపూడి శ్రీనివాసరావు

యువతి అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై గురువారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం. . కేవీపీ కాలనీకి చెందిన వెంకాయమ్మ బైపాస్‌రోడ్డులోని ఓ పార్శిల్ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గత నెల 25 ఉదయం ఉద్యోగానికి వెళ్లిన తన కుమార్తె తిరిగిరాలేదని ఎన్నిచోట్ల వెతికినా కనిపించలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నగరంపాలెం సీఐ నజీర్‌బేగ్ తెలిపారు.

నగరాభివృద్ధిలో బిల్డర్లు భాగస్వాములవ్వాలి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలని.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం మేయర్‌ను బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బిల్డర్లు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలన్నారు. భవన నిర్మాణాలు పూర్తయ్యాక నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేసిన వారికి వెంటనే ఎన్‌వోసీ జారీ చేసి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. నగరానికి సంబంధించిన ఆధునీకరించిన మాస్టర్‌ప్లాన్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ అమరావతి రాజధానిలో అంతర్భాగంగా ఉన్న గుంటూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. బిల్డర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నెరెడ్కో అధ్యక్షుడు నాగవంశీ, కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి సాయి, కమిటీ సభ్యులు సాంబశివరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసకుమార్, నందు, తిరుపతయ్య, వంశీ, శ్రీనివాస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి ఘటన, ఈ నెల 2న ప్రధాని మోదీ గుంటూరు జిల్లా పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా స్టేషన్ ఆవరణలో తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు అధికారులకు తెలియజేశారు. డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐలు కరుణాకర్, వీరబాబు, అంజిబాబు, ఎస్సైలు లక్ష్మీనారాయణరెడ్డి, జ్యోతి, శ్రీనివాసరెడ్డి సిబ్బంది ఉన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఉచిత యోగా శిక్షణ శిబిరం నేడు

మంగళగిరి, న్యూస్‌టుడే: గీతా యోగా ఆరోగ్య సేవా కేంద్రం ఆధ్వర్యాన మంగళగిరిలోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో ఈ నెల 2 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు పంచుమర్తి సత్యనారాయణ యోగి గురూజీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గత తొమ్మిదేళ్ల నుంచి నేటి వరకు 221 శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. 15 రోజులు జరిగే ఈ కార్యక్రమంలో యోగాసనాలు, ప్రాణాయామం తదితర అంశాలపై ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

పాఠ్యపుస్తకాలొచ్చాయ్..

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు ఈ ఏడాది ముందుగానే వచ్చాయి. వాటిని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు శ్రీనివాసరావు, జాకబ్ భద్రపరిచారు. 1 నుంచి 10వ తరగతి వరకు 27 ప్రాథమిక, 9 ఉన్నత పాఠశాలలకు సంబంధించి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 5993 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 2549 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ఫిరంగిపురంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. జనాలపై దాడి చేస్తూ.. ఇళ్లలోకి చొరబడుతున్నాయి. **- భాషా, విశ్రాంత ఉపాధ్యాయులు, - న్యూస్‌టుడే, ఫిరంగిపురం గ్రామీణం**

✔ గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించి కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో తాడికొండ, న్యూస్‌టుడే**


? నిడముక్కల గ్రామం కొండపై నివాసం ఉంటున్న ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. **-గ్రామస్థులు**

✔ తాగునీటి పైపులైన్ ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తాం. **-సమతావాణి, తాడికొండ ఎంపీడీవో**

? నిడముక్కల గ్రామ శివారు వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోయాయి. నడిచేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. **-గ్రామస్థులు**

✔ ఆ ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం. **- సాయిలీల, తాడికొండ ఈవోపీఆర్‌డీ సాయిలీల**

కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన



నిడుముక్కలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామని అందుకు తగిన రీతిలో నాయకులు పనిచేస్తున్నారని తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. కంతేరు, నిడుముక్కల గ్రామాలలో గురువారం ఆయన ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా వితంతు పింఛన్లు అందజేశారు. నిడుముక్కల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు అందజేశారు. నిడుముక్కలలో కొండపై గృహాలలో ఉంటున్న ప్రజలకు తాగునీటి సరఫరా, రోడ్డు వసతుల కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎంపీడీవో సమతావాణి, మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధు, నాయకులు యడ్లపల్లి సాంబశివరావు, తెలుగు యువత అధ్యక్షుడు చిగురుపాటి అనూప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని 17 గ్రామాల్లో గురువారం ఒక్కరోజే 92 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే గ్రామ పంచాయతీల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం రూ.2.90 కోట్ల వరకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పి.రమేష్ తెలిపారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు మండలంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 90 శాతం పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 6598 మందికి గానూ 5962 మందికి సిబ్బంది అందజేసినట్లు తెలిపారు. మిగతావారికి శనివారం అందిస్తారని చెప్పారు.



వట్టిచెరుకూరులో..

3న ఎస్ఆర్ఎంలో ఉపకరణాల పంపిణీ

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మే 3న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గ్రామీణ మహిళలకు 72 లక్షల విలువైన వివిధ వృత్తులకు సంబంధించిన ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. యూనివర్సిటీకి చెందిన ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడికొండ, తాడేపల్లి, మంగళగిరి, విజయవాడతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలానికి చెందిన 1500 మంది మహిళలకు స్వయం ఉపాధికి వివిధ పనుల్లో శిక్షణ అందించారు. అందులో సమగ్రంగా శిక్షణ పొందిన 100 అంకుర సంస్థలకు మిషనరీని అందించనున్నారు.

ఎఫ్‌వోగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్‌గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, వికాస సభ్యులు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఇతర నాయకులు యెషయి, వెంకటేష్, నాగేశ్వరరావు, నాగరాజు, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య..ఇక ప్రయాణం భద్రం

రూ.30 లక్షలతో చెరువు చుట్టూ రివిట్‌మెంట్ ❖ మంత్రి లోకేశ్ చొరవ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి నుంచి రాష్ట్ర సచివాలయం, ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే ప్రతి వాహనం ఎర్రబాలెం నల్లచెరువు కట్ట మార్గంలోనే అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రజలు, వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. 'యూ' ఆకారంలో ఉన్న చెరువు కట్టరోడ్డుకు మార్జిన్లు లేక రివిట్‌మెంట్ ఏర్పాటు చేయకపోవటం వల్ల ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 19వ తేదీ 'ఈనాడు'లో 'ప్రమాదాల ముట్టడి.. గోడ కడితే కట్టడి' శీర్షికను ఫొటోతో ప్రచురించింది. మంత్రి నారా లోకేశ్ స్పందించి నల్లచెరువు కట్ట రోడ్డుకు మార్జిన్లు ఏర్పాటు చేయించి రివిట్‌మెంట్ ఏర్పాటు చేయించారు. ఆర్ అండ్ బీ అధికారులు రూ. 30 లక్షల నిధులతో ఈ పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన



పూర్తైన రక్షణ కంచె నిర్మాణం

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: యర్రగుంట్లపాడులో గురువారం శ్రీవరసిద్ధి వినాయకుడు ఆలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టారు. కానుకలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదం వితరణ, అన్నదానం జరిగింది.

ఆలయంలో చోరీ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు మండలం రావిపాడులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు తీసి బంగారు మంగళసూత్రాలు రెండు, వెండి కిరీటం, వెండి చేతులు, 4 వెండి గొలుసులు, వెండి బొట్టు అపహరించారు. ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాను పగలకొట్టి అందులోని భాగాలను ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ఎస్సై మధూవపన్ పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

10 నుంచి క్రికెట్ పోటీలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల తారక రామా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కళాశాల క్రీడామైదానంలో ఈ నెల 10వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండో బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలుగా ప్రకటించారు. ప్రవేశ రుసుం రూ.800 ఈనెల 8వ తేదీలోగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8801013991 లేదా 9581152824కు ఫోన్ చేయాలన్నారు.

కులగణనకు ఆమోదంపై హర్షం

మంగళగిరి: కులగణనకు కేంద్రం ఆమోదం తెలపడంతో మంగళగిరిలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ మేరకు గురువారం సంఘం కార్యాలయం వద్ద ప్రధాని మోదీ, ఏపీబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చిత్రపటాలకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పారెపల్లి మహేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు ఉడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, జంజనం వరప్రసాద్, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు హెల్ప్‌డెస్క్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం మండల విద్యావనరుల కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎంఈవో సీహెచ్ రమాదేవి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో మే 2 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌లో ఉన్న సిబ్బందిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు - **రంగారెడ్డి జిల్లా, కొండాపూర్ వాస్తవ్యులు,** ప్రస్తుత అమెరికా నివాసి మరియు లేట్ **మువ్వ పుల్లయ్యచౌదరి గారి కుమారుడు అయిన మువ్వ రవికుమార్** గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా - మా క్లయింటు దిగువ 'A' షెడ్యూలు దాఖలా జాయింటు ఆస్తిలోని తన వాటా గూర్చి తన అన్న గారైన మువ్వ రమేష్ గారి పేర జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి, అమెరికాలోని నోటరీ పబ్లిక్ ఎదుట నోటరీ చేయించి ఇవ్వగా, సదరు **జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలు విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి కార్యాలయంనందు ది.08.04.2021న** ఎండార్స్ చేయడమైనది. అలాగే దిగువ 'B' షెడ్యూలు దాఖలా జాయింటు ఆస్తిలోని తన వాటా ఆస్తిని తన అన్నగారైన మువ్వ రమేష్ గారి పేర జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి, అమెరికాలోని నోటరీ పబ్లిక్ ఎదుట నోటరీ చేయించి ఇవ్వగా, సదరు **జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలు గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ వారి కార్యాలయంనందు ది.08.04.2021న** ఎండార్స్ చేయడమైనది. సదరు తన అన్నగారి పేరిట వ్రాయబడిన రెండు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలను మా క్లయింట్ తన వ్యక్తిగత కారణాల రీత్యా రద్దు చేసుకోవడమైనది. కావున సదరు రెండు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీల ఆధారంగా ఎవరూ ఎట్టి లావాదేవీలూ చేయరాదనియూ, అట్టి లావాదేవీలు చెల్లనేరవనియూ, మా క్లయింటును బైండు చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : 'A' షెడ్యూలు - NTR జిల్లా, **విస్సన్నపేట మండలం,** చంద్రుపట్ల గ్రామంలో, విస్సన్నపేట సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయ పరిధిలోని **R.S.Nos.127 - 2 & 127/3A** దాఖలా **య.4-55ట్ల** భూమికి హద్దులు- తూర్పు:డొంక రోడ్డు, దక్షిణం: మువ్వ వినోద్ కుమార్ గారి ఆస్తి, పడమర: గోడ సత్యనారాయణ గారి ఆస్తి, ఉత్తరం : R&B రోడ్డు.

'B' షెడ్యూలు - గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, చినకాకాని గ్రామంలో, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయ పరిధిలోని **D.No. 35** నందలి ప్లాట్ నెం.99 నుండి 101 దాఖలా **739చ॥గ॥ల** ఆస్తికి హద్దులు - తూర్పు: ఇతరుల ప్లాట్, దక్షిణం : ప్లాట్ నెం.98, పడమర : 33 అడుగుల జాయింట్ దారి, ఉత్తరం : సర్కారు డొంక.

ఇట్లు,
B. కోటి రెడ్డి, B.S. రత్నాకర్ రెడ్డి, అడ్వకేట్స్
అమ్మన ఎస్టేట్స్, ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా,
ప్రకాశం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002

మంగళగిరి
• మంగళగిరి • తాడికొండ • ప్రతిపాడు

విదేశాల్లోని అమరావతి శిల్ప సంపద రప్పించాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశ విదేశాల్లో ఉన్న మన అమరావతి శిల్ప సంపదను తిరిగి అమరావతికి రప్పించేందుకు కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అఖిల భారత పంచాయతీ పరిషత్తు(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా దేశ విదేశాల్లో ఉన్న అమరావతి శిల్ప సంపదను తీసుకురావాలని కోరుతూ వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. అమరావతిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబు ఆకాంక్ష నెరవేరాలంటే.. విదేశాల్లో ఉన్న అమరావతి శిల్ప సంపదను తిరిగి తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

సిద్ధమైన మహాకాళి ఆలయం


రూపుదిద్దుకున్న ముఖమండపం, విమానగోపురం

కంఠంరాజుకొండూరు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: మహాకాళి అమ్మవారి ఆలయం అద్భుతంగా రూపుదిద్దుకుంది. రెండేళ్ల క్రితం మొదలైన రాతి నిర్మాణ నేటికి పూర్తయింది. శుక్రవారం నుంచి ప్రతిష్ఠా కార్యక్రమాలు మొదలవుతున్నాయి. ఇందుకు దేవాదాయ శాఖ రూ. కోటి నిధులు కేటాయించింది. భక్తులు రూ. 3.5 కోట్లకు పైగా విరాళాల రూపంలో ఇచ్చారు. దీనిలో సింహభాగం దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వాసంతిలు, మనుమలు వశిష్ఠ, మనువడు శ్రీప్రదీప్‌వసిష్ఠరెడ్డి సమకూర్చారు.

గణపతి పూజతో ప్రారంభం..: గణపతి పూజతో మొదలై హోమాలు జరుగుతాయి. ఉదయం 11 గంటలకు భక్తులు స్వయంగా ఆవుపాలతో విగ్రహాలను అభిషేకం చేసుకోవచ్చు. 3న ఉదయం 11 గంటలకు భక్తులు తమ ఇళ్ల నుంచి బిందెలతో నీరు తెచ్చుకుని స్వయంగా జలాభిషేకం చేయవచ్చు. 4న ఉదయం 7.49 గంటలకు ప్రతిష్ఠ జరుగుతుంది. అన్నసంతర్పణ ఉంది. మంత్రులు నారా లోకేశ్, ఆనం రాంనారాయణరెడ్డి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

అమరావతిలో ఆనంద వికాసం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామాల్లో సందడి నెలకొంది. గత ప్రభుత్వంలో నిత్యం పోలీసు కవాతులు, ఉద్యమ పోరాటాలతో అట్టుడికిన గ్రామాల్లో నేడు కూటమి ప్రభుత్వంలో నేడు ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపిస్తోంది. అమరావతికి ఒకేసారి రూ.50 వేల కోట్ల పనులకు శుక్రవారం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవం జరుగుతుండటంతో అన్నదాతలు సంబరాలు చేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని గ్రామాల్లో లౌడ్ స్పీకర్లతో అమరావతి ఉద్యమ గీతాలు వినిపిస్తూ సందడి చేస్తున్నారు. అధికారులు, కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి బొట్టుపెట్టి బహిరంగ సభలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. తుళ్లూరులో శుక్రవారం ఉదయం రాజధాని రైతులు, రైతుకూలీలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని సభను విజయవంతం చేయాలని భారీ ర్యాలీ తలపెట్టారు.


ఆహ్వాన పత్రికలు అందుకున్న రాజధాని మహిళలు

కూటమి, జెండాలు, ఫ్లెక్సీలతో వీధులన్నీ కళకళలాడుతున్నాయి. 29 గ్రామాల ప్రజలందరూ ఆకుపచ్చ కండువాలు ధరించి గుర్తింపు కార్డులు తీసుకువచ్చి సమావేశానికి హాజరు కావాలని అమరావతి ఐకాస పిలుపునిచ్చింది.

మేడికొండూరు, న్యూస్‌టుడే: అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మేడికొండూరు, ఫిరంగిపురం మండలంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికీ తిరుగుతూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో శుక్రవారం జరిగే ప్రధాని మోదీ సభకు రావాలని ఆహ్వానం పలుకుతున్నారు.

బస్సులు సిద్ధం..

వట్టిచెరుకూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ప్రధాని మోదీ సభకు ప్రజలను తరలించేందుకు మండలంలోని గ్రామాలకు 71 బస్సులు కేటాయించారు. వాటిల్లో ప్రయాణించే వారి కోసం మజ్జిగ, ఆహారం అందించే ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలం నుంచి 90 బస్సులు ఏర్పాటు చేశారు. 4500 మందిని సభకు తీసుకెళ్లేందుకు డీఆర్‌డీఏ, వెలుగు ఏపీఎం వి.లాజర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


మేడికొండూరు: పాలడుగులో పిలుపిస్తున్న కూటమి నాయకులు

కూటమి జెండాల రెపరెపలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో రాజధానికి వెళ్లే మార్గాలన్నీ ముస్తాబయ్యాయి. ప్రకాశం బ్యారేజీపై ఇరువైపులా తెదేపా, జనసేన, భాజపా జెండాలు బ్యారేజీపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కనకదుర్గమ్మ వారధిపై సైతం జెండాలు రెపరెపలాడుతున్నాయి.



ప్రధాని సభకు సర్వం సిద్ధం



సభాస్థలికి దారి చూపుతూ ఏర్పాటు చేసిన సూచికలు


వేదిక వద్దకు వెళ్లే మార్గం వెంబడి మొక్కలు


సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం అయ్యింది. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 5 లక్షల మంది జనం తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వేసవి నేపథ్యంలో పలు సౌకర్యాలు కల్పించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఎండ నుంచి రక్షణ



ఎండల కారణంగా మంగళగిరి నరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు నేలపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన దేవస్థానం అధికారులు... కాళ్లు కాలకుండా పార్కింగ్ ప్రదేశం నుంచి ఆలయం లోపలి వరకు తెల్లటి రంగు వేయించారు. లోపల గ్రీన్‌మ్యాట్‌లు ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు.

- న్యూస్‌టుడే, మంగళగిరి

కూల్చారు.. కట్టరేంటో..!

కొర్రపాడులో ప్రధాన రహదారి పక్కన ఒకే చోట వడపోతబావులు, వాటర్ ట్యాంక్ ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో ఒక పక్క ఉన్న ప్రహరీ గోడ తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ తిరిగి నిర్మించలేదు. దీంతో రక్షణ లేకుండా పోతుంది. గేదెలు సంచరిస్తున్నాయి. మరో పక్క పిల్లలు అటుగా వెళ్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మేడికొండూరు


గోడ తొలగించిన ప్రదేశం

చలివేంద్రం ప్రారంభం

పుల్లడిగుంట (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని పుల్లడిగుంట ఐదోమైలులో ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ వ్యాపారవేత్త నేరెళ్ల శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. సేవా ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పుటూరి చినరాములు, ప్రముఖ కాటన్ వ్యాపారవేత్తలు నేరెళ్ల హరిబాబు, ప్రసాద్, శ్రీనివాసరావు, కార్తీక్, తిరుపతిరావు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, ఉప్పుటూరి చినరాములు

పోరాట యోధుడు పుచ్చలపల్లి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శణీయులని సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సుందరయ్య జయంతి సందర్భంగా గురువారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడారు. పేదల కోసం తన ఆస్తిని త్యాగం చేసిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. నాయకులు వెంకటసుబ్బారావు, రామారావు, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

3న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పర్యటన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం రానున్నారు. అత్యవసర విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీయూ, రోటరీ క్లబ్ అందిస్తున్న వెంటిలేటర్లను ఆయన ప్రారంభించనున్నారు. కేంద్ర మంత్రితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు రానున్నారు.


కొర్నెపాడులో అంతర్గత రహదారులు లేకుండా ఇలా..

అసౌకర్యాలకు నిలయాలు.. పేదల కాలనీలు

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని కుర్నూతల, పుల్లడిగుంట, కొర్నెపాడు, కాట్రపాడు, చింతపల్లిపాడు వంటి గ్రామాల్లోని పేదలకు కొర్నెపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ (నాటి జగనన్న కాలనీలు) అధ్వానంగా మారాయి. జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన గత వైకాపా ప్రభుత్వం ఇళ్లస్థలాలు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకుంది. అంతర్గత రహదారులు కూడా అభివృద్ధి చేయలేదు. తద్వారా వర్షం కురిసిన ప్రతిసారి బురదలోనే గడపాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు మంచినీటి పైపులైన్లు కూడా ఏర్పాటు చేయలేదు. కాలనీలో మురుగునీరు పారుదల కాలువలు నిర్మాణం చేపట్టలేదు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజారోగ్యం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలపై అధికారులు దృష్టిపెట్టాలని వారు కోరుతున్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు

పొన్నూరు: చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 26 సంవత్సరాలు నుంచి విజ్ఞాన్స్ సంస్థలో వివిధ హోదాలో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ కార్యకలాపాలను సమన్వయం చేసుకుని సమర్థంగా పని చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉపకులపతి పి.నాగభూషణ్ ఆయన్ని అభినందించారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

కార్మికులతో కళకళ


తుళ్లూరులో కార్మికుల కోసం నిర్మించిన శిబిరాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నగర నిర్మాణ పనుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులతో రాజధాని ప్రాంతం కళకళలాడుతోంది. ఒకప్పుడు రాత్రి, పగలు తేడా లేకుండా దాదాపు 40 వేల మంది కార్మికులు నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎటు చూసినా విద్యుత్తు వెలుగులే కనిపించేవి. వైకాపా అధికారంలోకొచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాజధాని ప్రాంతాన్ని నిర్మానుష్యంగా మార్చేసింది. ఇన్నాళ్లకు మంచిరోజులొచ్చాయి. రహదారులు, భవనాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధి, వరద ముంపు నివారణకు కాలువల నిర్మాణం వంటి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు అవసరమైన కార్మికులను తీసుకొచ్చారు. వీరికి వసతి, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.


తుళ్లూరులో ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్ సైట్‌లో

రాజధానిలో కార్మికుల సందడి

బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది కార్మికులు తరలివచ్చారు. వీరు రహదారులు, భవన నిర్మాణ పనుల్లో పాల్గొంటారు. భారీ క్రేన్లు, లారీలు, యంత్ర సామగ్రిని కూడా తీసుకొచ్చారు. ప్రస్తుతం రహదారులు, కట్టడాల ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. మరోవైపు కాలువల్లో జేసీబీలు, పొక్లయిన్లతో పూడిక తీసే పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం

వడ్లమూడి (చేబ్రోలు), న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ మాజీ మంత్రి, దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో వడ్లమూడి బాల కోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ పాడితోపాటు ఎడ్లను పోషిస్తున్న రైతులను ఉత్సాహపరిచేందుకు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముందుగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ లాగుడు బండకు పూజ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై ప్రతి ఏటా ఇటువంటి బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో 150కు పైగా ఎడ్ల జతలు పాల్గొంటున్నాయన్నారు. మొదటి రోజు టచ్ పళ్ల విభాగంలో 18 జతలు పోటీపడ్డాయి.

ఇప్పుడు కాకుంటే.. ఇంకెప్పుడు..?

ప్రత్తిపాడు, పట్టిచెరుకూరు, కాకుమాను, న్యూస్‌టుడే


కాకుమాను: చినలింగాయపాలెం-పాండ్రపాడు మార్గం

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో పలు రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నేల వంతెన శిథిలావస్థలో ఉన్నాయి. ప్రత్తిపాడు- వేసవిలో రోడ్ల నిర్మాణం చేపడతారని ప్రజలు ఎదురు చూశారు. మే నెలలో ప్రారంభించకపోతే జూన్, జులైలో వర్షాలకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు మీదుగా పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం వరకు 9 కిలోమీటర్ల రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. గత ఆరేళ్ల నుంచి ప్రత్తిపాడు మండలంలోని గొట్టిపాడు, గనికపూడి, పెదనందిపాడు మండలానికి చెందిన కొప్పర్రు, అన్నపర్రు గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


భారీ గుంతలతో ప్రమాదకరంగా వంగిపురం రోడ్డు


కుర్నూతల వద్ద..

బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2020లో రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసి 2022లో శంకుస్థాపన చేయడంతో 2023లో గుత్తేదారుడు పనులు ప్రారంభించాడు. గొట్టిపాడులో వంతెన, ప్రత్తిపాడులో సిమెంటు కాల్వలను నిర్మించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారుడు పనులు మధ్యలోనే నిలిపేశాడు. ప్రత్తిపాడు నుంచి చిన కొండ్రుపాడు, జాతీయ రహదారికి వెళ్లే 5 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు రాళ్లు లేచి దారుణంగా ఉంది.

ఎనిమిది గ్రామాలపై ప్రభావం..

పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంలో గుంటూరు- పర్చూరు రోడ్డు నుంచి కాకుమాను మండలం వల్లూరు వరకు 11.24కిలోమీటర్ల వరకు తారు రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేయాల్సిన రోడ్డుకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ పనులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డును రద్దు చేయాల్సి వచ్చింది. భారీగా గుంతలు పడటంతో 8గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ప్రత్తిపాడు ఏఈ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు- గొట్టిపాడు రోడ్డు నిర్మాణ పనులు వారం, పది రోజుల్లో ప్రారంభం అవుతాయని చెప్పారు. చినకొండ్రుపాడు రోడ్డు పనులు త్వరలోనే చేపడతామని, అబ్బినేనిగుంటపాలెం - వల్లూరు రోడ్డుకు తిరిగి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

అధ్వాన రహదారులతో ప్రజల ఇక్కట్లు

ఏళ్లుగా ఇంతే..!

● చినలింగాయపాలెం నుంచి పాండ్రపాడు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. గుంతలలో దారిని వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. రహదారిపై రాళ్లు తేలి ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయని, ఐదేళ్లగా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పట్టిచెరుకూరు మండలంలోని కుర్నూతల గ్రామానికి పర్చూరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి విస్తరించిన పంచాయతీరాజ్ రోడ్డు గుంతలతో నిండిపోయింది. ద్విచక్రవాహనాలపై రాకపోకలకు నరకం చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఏఈ వెంకటరత్నం మాట్లాడుతూ ఈరహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

అవగాహన పెంచేలా.. ఆపద తప్పేలా..

కిశోర బాలికలకు నేటి నుంచి వేసవి శిక్షణ



ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు కిశోర వికాసం- వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మే 2 నుంచి జూన్ 10వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామాల వారీగా నిర్వహించనున్న ఈ కార్యక్రమం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో జరగనుంది. మే, 2న బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం, 6న రుతుక్రమం పరిశుభ్రత, 9న పునరుత్పత్తి ఆరోగ్యం- బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, 13న బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన, 16 కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 20న ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం, 27న సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత, వివిధ సమస్యలను ఎదుర్కోవడం, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, జూన్, 3న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత, 10న బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, నివారణ వంటి అంశాలపై శిక్షణ ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసు, యానిమేటర్లు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు శిక్షణ ఇచ్చేందుకు సంసిద్ధమయ్యారు. గ్రామాల వారీగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో కిశోర బాలికలు పాల్గొనాలని సెక్టారు సూపర్‌వైజర్లు భారతి, మాధవి చెప్పారు.

★ ఐసీడీఎస్ ప్రాజెక్టు పేరు: ప్రత్తిపాడు.
★ అంగన్వాడీ కేంద్రాలు : 226
★ కిశోర బాలికలు : 7639

అమరావతి సభను జయప్రదం చేద్దాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రధాన నరేంద్ర మోదీ పాల్గొనే రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల సభను జయప్రదం చేద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సభకు జన సమీకరణ ఏర్పాట్లపై చర్చించడానికి ఆయన గురువారం తెనాలి వచ్చారు. స్థానిక గౌతమ్ గ్రాండ్‌లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఇతర నాయకులు, రవాణా వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో రాజధానిని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బీ.టీ.నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నాయకుడు చల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు


దుగ్గిరాల రైలుపేటలో


మంగళగిరిలో తెదేపా నేత పోతినేని ఆధ్వర్యంలో..


పెదనందిపాడులో..


ప్రత్తిపాడులో సీపీఐ నాయకులు


తాడికొండలో సీఐటీయూ నాయకులు..


మల్కాపురంలో

న్యూస్‌టుడే బృందం

కార్మికులంతా ఏకతాటిపై నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ నాయకుడు రమేష్‌బాబు అన్నారు. మేడే సందర్భంగా పెదనందిపాడు పాతబస్టాండ్ కూడలిలో గురువారం భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆయన ఎగురవేశారు. ★ వట్టిచెరుకూరులో సీఐటీయూ నాయకురాలు సంధ్య, ప్రత్తిపాడులో ఏఐటీయూసీ జెండాను సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, సీఐటీయూ జెండాను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు ఆవిష్కరించారు. ★ తాడికొండలో స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు సాంబశివరావు, గాంధీ మోహన్‌రావులు జెండాలు ఎగురవేశారు. మేడికొండూరులోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. ● తుళ్లూరు మండలం మల్కాపురంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ★ దుగ్గిరాలలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పారావు.. పసుపు ముఠా కార్మికులతో కలిసి జెండాను ఆవిష్కరించారు.



మంగళగిరి: కార్మికులు, సీఐటీయూ నాయకుల ర్యాలీ

★ మంగళగిరిలో తెదేపా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గనిరాజు, ఏఐటీయూసీ ఆధ్వర్యాన చిన్నితిరుపతయ్య, సీపీఎం ఆధ్వర్యాన నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

గృహరుణం బీమాతో భరోసా

ఇల్లు కొనేందుకు గృహరుణం తీసుకుంటాం. అన్నీ సరిగ్గా సాగుతుంటే.. రుణం తీర్చడంలో ఏ ఇబ్బందీ లేదు. కానీ, అనుకోని పరిస్థితుల్లో సంపాదించే వ్యక్తికి ఏదైనా జరిగితే? ఆ అప్పు తీర్చడం ఎలా? ఇంటిని అమ్మేయాల్సిందేనా? కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

అప్పు చేసినప్పుడు దాన్ని తీర్చడమూ మన బాధ్యతగానే భావించాలి. అన్ని సందర్భాలూ ఒకేలా ఉండవనేది వాస్తవం. అనుకోని సందర్భాలు వచ్చినప్పుడు ఈ రుణాన్ని తీర్చడానికి అనుబంధంగా ఒక బీమా పాలసీ ఉండాలి. ఆ మాటకొస్తే గృహరుణమే కాదు.. ప్రతి రుణానికీ తోడుగా ఒక పాలసీ ఉండాల్సిందే. ఆర్థిక ప్రణాళికలో ఇది ఎంతో కీలకం. రుణగ్రహీత కుటుంబానికి దూరమైనప్పుడు అప్పులను తీర్చడంలో ఈ పాలసీలు ఆదుకుంటాయి. ప్రస్తుతం బ్యాంకులు రుణం ఇచ్చేటప్పుడే తమకు అనుబంధంగా ఉన్న బీమా సంస్థల నుంచి లోన్ కవర్ టర్మ్ పాలసీలను ఇప్పిస్తున్నాయి. దీనికి అవే రుణమూ ఇస్తున్నాయి. రుణం తీసుకునేటప్పుడు దానికి రక్షణగా ఎలాంటి పాలసీలు తీసుకోవాలనే విషయంలో కొన్ని సందేహాలు ఉంటాయి. వాటికి సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



బ్యాంకు నుంచే తీసుకుంటే...

సొంతిల్లు కోసం తీసుకునే గృహరుణం సాధారణంగా 20 ఏళ్లపాటు కొనసాగే ఒక దీర్ఘకాలిక ఒప్పందం. నెల సంపాదనలో 25-40 శాతం వరకూ ఈ రుణాన్ని తీర్చేందుకే వెళ్తుంది. దీర్ఘకాలంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ రాకుండా చూసుకోవాలి.

గృహరుణానికి రక్షణగా హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్‌లను తీసుకోవాల్సిందిగా బ్యాంకులు సూచిస్తుంటాయి. రుణ వ్యవధి, మొత్తానికి సమానంగా ఉండేలా ఈ పాలసీలను తీసుకోవచ్చు.

■ రుణ మొత్తం తగ్గుతూ ఉంటే బీమా విలువా ఆ మేరకు పడిపోతుంటుంది. దీన్ని రెడ్యూసింగ్ కవర్ అని అంటారు. కొన్ని బీమా సంస్థలు పాలసీ విలువను తగ్గించకపోవచ్చు. దీన్ని లెవల్ కవర్‌గా చెప్పొచ్చు. గృహరుణానికి సంబంధించిన బీమా పాలసీ అయినప్పటికీ సాధారణ టర్మ్ ఇన్సూరెన్స్ నిబంధనలే వర్తిస్తాయని మర్చిపోవద్దు. రుణగ్రహీత వయసు, ఆరోగ్యం, బీమా మొత్తం.. ఇతర అంశాల ఆధారంగా ప్రీమియం ఉంటుంది.

■ ప్రమాదవశాత్తూ ఏదైనా వైకల్యం సంభవించినా కొన్ని బీమా సంస్థలు పరిహారాన్ని ఇస్తాయి. కొన్ని సంస్థలు రుణగ్రహీత మరణిస్తేనే పరిహారం చెల్లిస్తాయి. తీవ్రవ్యాధుల బారిన పడినప్పుడూ రుణాన్ని తీర్చే విధంగానూ పాలసీలను ఎంచుకోవచ్చు. ఉద్యోగం కోల్పోవడం, ఆదాయం ఆగిపోవడం లాంటి సందర్భాల్లో పరిమిత కాలంపాటు వాయిదాలను చెల్లించే పాలసీలూ ఉన్నాయి. ఇవన్నీ ప్రాథమిక లోన్ కవర్ పాలసీకి అనుబంధ రైడర్లుగా తీసుకోవాల్సి వస్తుంది.

■ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. గృహరుణానికి రక్షణగా ఉండేలా బీమా పాలసీ తీసుకోవాలి. అయితే, తప్పనిసరిగా బ్యాంకు చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇది గృహరుణగ్రహీత విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది.

బ్యాంకు మారితే: ఈ లోన్ కవర్ టర్మ్ పాలసీలు బ్యాంకులు అందించే బృంద బీమాలో భాగంగా ఉంటాయి. ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు గృహరుణం మార్చుకున్నారనుకోండి. పాత రుణం కోసం తీసుకున్న బీమా రద్దవుతుంది. కొత్త బ్యాంకుకు మారినప్పుడు అక్కడ మళ్లీ మరో పాలసీ తీసుకోవాల్సి రావచ్చు. ఇది ఒక ప్రతికూలత. అయితే, ఈ బీమా పాలసీని వ్యక్తిగత టర్మ్ పాలసీగా మార్చాల్సిందిగా బ్యాంకును కోరవచ్చు. అలా మారిన తర్వాత కొత్త బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి ఆ బీమా పాలసీని అనుసంధానం చేయొచ్చు.

రుణానికి రక్షణగా టర్మ్ పాలసీ తీసుకోవడం తప్పనిసరి. దీంతోపాటు కుటుంబ ఆర్థిక బాధ్యతలు తీర్చేలా మరో టర్మ్ పాలసీ ఉండేలా చూసుకోవాల్సిన అవసరమూ ఉంది. అప్పుడే మీపై ఆధారపడిన వారికి ఆర్థికంగా ఏ ఇబ్బందీ ఉండదు.

భారం అవుతుందా?

గృహరుణం ఇచ్చిన బ్యాంకుకు అనుబంధంగా ఉన్న బీమా సంస్థల నుంచి లోన్ కవర్ టర్మ్ పాలసీ తీసుకున్నప్పుడు బ్యాంకు ఆ ప్రీమియానికి సంబంధించిన రుణాన్నీ ఇస్తుంది. దీన్ని మనం గృహ రుణ వాయిదాతో కలిపి చెల్లించాల్సి వస్తుంది.

■ ఉదాహరణకు 35 ఏళ్ల వెంకట్ ఫ్లాట్ కొనేందుకు రూ. కోటి బ్యాంకు రుణం తీసుకున్నారు. దీనికి ఆయన బీమా పాలసీ తీసుకోవాలని అనుకున్నారు. బ్యాంకు నుంచి బృంద టర్మ్ పాలసీ తీసుకుంటే ప్రీమియం దాదాపు రూ.3,00,000 వరకూ (లెవల్ కవర్) చెల్లించాల్సి వస్తుంది. బ్యాంకు ఈ మేరకు రుణం ఇచ్చిందనుకుందాం. వర్తించే వడ్డీ రేటు 8.85 శాతం అనుకుంటే.. నెలవారీ వాయిదా రూ.2,670 ఉంటుంది. 20 ఏళ్లలో వడ్డీతో రూ.6,40,873 చెల్లించాల్సి వస్తుంది.

■ దీనికి బదులుగా రూ.కోటి టర్మ్ పాలసీని సొంతంగా తీసుకున్నారనుకుందాం. అప్పుడు ఏడాదికి ప్రీమియం రూ.19వేల వరకూ ఉంటుంది. అంటే. . 20 ఏళ్లకు కలిపి చెల్లించేది రూ.3,80,000. చూశారుగా ఎంత తేడానో. (గమనిక: ఈ ప్రీమియం వివరాలు అంచనాలు మాత్రమే. పూర్తి వివరాలు మీ బ్యాంకు, బీమా సంస్థను సంప్రదించి తెలుసుకోవాలి. వయసు, ఆరోగ్య పరిస్థితి, అలవాట్లను బట్టి ప్రీమియం మొత్తం మారుతుంది) కాబట్టి, ఏ పాలసీ తీసుకోవాలన్నది ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయించుకోవాలి.

siri@eenadu.net

ఏటీఎం రుసుము పెరిగింది

అనుమతించిన పరిమితికి మించి ఏటీఎం లావాదేవీలు చేసినప్పుడు రుసుముల భారం తప్పదు. గతంలో రూ.21గా ఉన్న ఈ ఛార్జీ ఇప్పుడు రూ.23కు పెరిగింది. అన్ని బ్యాంకుల ఏటీఎంలకూ ఇది వర్తించనుంది.

ప్రస్తుత నిబంధనల ప్రకారం మెట్రో నగరాల్లోని ఖాతాదారుడు నెలకు తన సొంత బ్యాంకు ఏటీఎం నుంచి 5, ఇతర బ్యాంకుల ఏటీఎం నుంచి 3 పర్యాయాల వరకూ నగదు (నగదు తీసుకోవడం, జమ చేయడం), ఆర్థికేతర లావాదేవీలు (నగదు నిల్వ తెలుసుకోవడం, పిన్ మార్పు లాంటివి) చేసేందుకు వీలుంది. ఇతర ప్రాంతాల్లో సొంత బ్యాంకు నుంచి 5, ఇతర బ్యాంకుల నుంచి 5సార్లు ఈ లావాదేవీలు చేయొచ్చు. ఆ తర్వాత నుంచి ప్రతి లావాదేవీకి రూ.23 చొప్పున చెల్లించాల్సి వస్తుంది. ఈ పెరిగిన రేట్లు మే 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

రిటర్నులకు వేళాయె



ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కీలక ప్రకటన చేసింది. ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4లను నోటిఫై చేసింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2025-26)గాను ఆదాయపు పన్ను రిటర్నులకు వీటిని ఉపయోగించేందుకు వీలవుతుంది. ఎక్స్ఛేంజీల్లో నమోదైన ఈక్విటీ షేర్లు, ఈక్విటీ-ఆధారిత మ్యూచువల్ ఫండ్లను విక్రయించడం ద్వారా రూ.1.25 లక్షల వరకూ దీర్ఘకాలిక మూలధన లాభాలు ఉన్న పన్ను చెల్లింపుదారులూ ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఉపయోగించవచ్చు.

▲ **ఐటీఆర్-1:** దేశంలో నివసించే వ్యక్తి ఆదాయం రూ.50లక్షలున్న వారు, వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, సెక్షన్ 112ఏ ప్రకారం రూ.1.25 లక్షల లోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు, రూ.5,000 వరకూ వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి వర్తిస్తుంది.

▲ **ఐటీఆర్-4:** మొత్తం ఆదాయం రూ.50 లక్షల వరకూ ఉన్నవారు, వృత్తి, ఆదాయం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు, దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.1.25 లక్షల లోపు ఉన్నప్పుడు, సెక్షన్ 44ఏడీ, సెక్షన్ 44ఏడీఏ, సెక్షన్ 44ఏఈ కింద ఆదాయాలను గణించే వారు ఈ ఫారాన్ని వినియోగించాల్సి ఉంటుంది.

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31. వేతనాలు పొందే వారికి జూన్ 15 తర్వాతే ఫారం-16 అందే అవకాశం ఉంటుంది. వీరు అప్పుడే రిటర్నులు దాఖలు చేయడానికి వీలవుతుంది.

కొత్త పథకం

అన్ని విభాగాల షేర్లలో

యూటీఐ మ్యూచువల్ ఫండ్ కొత్తగా **యూటీఐ మల్టీక్యాప్ ఫండ్‌**ను ఆవిష్కరించింది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లలో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇది మల్టీక్యాప్ పథకం కాబట్టి, ఒక్కో తరగతికి చెందిన షేర్లకు కనీసం 25 శాతం చొప్పున నిధులు కేటాయిస్తుంది.. పోర్ట్‌ఫోలియో నిర్మాణం, నిర్వహణకు 'బాటమ్-అప్ ఇన్వెస్ట్‌మెంట్' విధానాన్ని అనుసరిస్తారు. మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకొని లాభాలు ఆర్జించే విధంగా దీనికి రూపకల్పన చేసినట్లు యూటీఐ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 13. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. 'నిఫ్టీ 500 మల్టీక్యాప్ 50:25:25 టీఆర్ఐ' సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్, గ్రోత్ ఆప్షన్ ఉన్నాయి. **ఫండ్ మేనేజర్ కార్తీక్ రాజ్ లక్ష్మణన్.**

వెండి కొనాలంటే

వెండి, బంగారం ధరలు మండిపోతున్నాయి. ఏడాది కాలంలో ఈ లోహాలపై పెట్టిన పెట్టిన పెట్టుబడి లాభాలు పండించింది. వెండి, బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో వెండిపై పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పిస్తూ డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను తీసుకొచ్చింది. **డీఎస్‌పీ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 9. కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి. ఈ పథకం కింద సేకరించిన నిధులను డీఎస్‌పీ సిల్వర్ ఈటీఎఫ్ యూనిట్లలో పెట్టుబడి పెడతారు.

ఇంటర్నెట్ వ్యవస్థలో...

ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ ఒక ఆసక్తికరమైన పథకాన్ని రూపొందించింది. అదే **ఎడిల్‌వైజ్ బీఎస్ఈ ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఫండ్.** దాదాపు 11 విభాగాలకు చెందిన కంపెనీలపై ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇ-రిటైల్, ఇంటర్నెట్, ఇ-లెర్నింగ్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫైనాన్షియల్ టెక్నాలజీస్ తదితర విభాగాలకు చెందిన కంపెనీలు ఇందులో ఉంటాయి. బీఎస్ఈ ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఆధారిత తొలి పథకం ఇదే కావడం గమనార్హం. ఈ నెల 9 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. ఎంతో వేగంగా మారుతూ ఉండే ఇంటర్నెట్ టెక్నాలజీకి చెందిన కంపెనీలపై పెట్టుబడి పెట్టే పథకం కాబట్టి, ఇందులో నష్టభయం కాస్త అధికంగానే ఉంటుంది. అదే సమయంలో ప్రతిఫలమూ ఎక్కువే ఉండొచ్చు. ఈ పథకానికి **ఫండ్ మేనేజర్లు భవేష్ జైన్, భరత్ లాహోటి.**

బ్యాంకుకు వెళ్లండి

ఆర్‌బీఐ రెపో రేటును రెండు సార్లు 0.25 శాతం చొప్పున తగ్గించింది. దీన్ని బ్యాంకులు రుణగ్రహీతలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కొన్ని బ్యాంకులు తమ రెపో ఆధారిత వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. మరికొన్ని ఈ విషయంలో ఎలాంటి ప్రకటనా చేయలేదు. అర శాతం వడ్డీ తగ్గిన నేపథ్యంలో మీ గృహరుణాన్ని ఒకసారి పరిశీలించండి. బ్యాంకు వడ్డీ రేటును తగ్గించిందా తెలుసుకోండి. మీ రుణం ఆన్‌లైన్ ఖాతాలోకి వెళ్తే వివరాలు తెలిసిపోతాయి. గతంలో ఉన్న వడ్డీ, ప్రస్తుతం ఎంత వర్తిస్తోందో చూడొచ్చు. ఒకవేళ వివరాలు తెలియకపోతే మీ బ్యాంకును సంప్రదించండి. కొన్నిసార్లు మీ క్రెడిట్ స్కోరు కారణంగా వడ్డీ తగ్గకపోవచ్చు. లేదా కొంత రుసుము చెల్లించాల్సి రావచ్చు. సాధ్యమైనంత తొందరగా వడ్డీ రేటును తగ్గించుకునే ప్రయత్నం చేయండి.